

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 8360 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 77.988 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి50, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం100.059మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## హోసియరీ, రెడీమేడ్ గార్మెంట్ క్లస్టర్ కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు వాస్తవమేనా..?



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ఫ్రోగ్రామ్(ఎంఎస్ఈ- సీడీపీ) కింద, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో హోసియరీ, రెడీమేడ్ గార్మెంట్ క్లస్టర్ కోసం ఒక కామన్ ఫెసిలిటీ సెంటర్ 2021లో ఆమోదించబడిందా అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. లోక్‌సభలో ఈ మేరకు గురువారం పలు ప్రశ్నలు వేశారు. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు ఎన్ని నిధులు విడుదల చేసిందని ప్రశ్నించారు. మార్చి 2025 నాటికి ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉన్నా.. పూర్తి చేయడంలో జాప్యానికి గల కారణాలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు సూక్ష్మ, చిన్న , మధ్య తరహా సంస్థల సహాయ మంత్రి సుశ్రీ శోభ కరండ్లజే సమాధానం ఇచ్చారు. మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ఫ్రోగ్రామ్ కింద, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులోని హోసియరీ అండ్ రెడీమేడ్ గార్మెంట్స్ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్(సీఎఫ్‌సీ) ఏర్పాటు ప్రతిపాదనను 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.8.2298 కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయంతో ఆమోదించారని చెప్పారు. ఇందులో ఇప్పటి వరకు విడుదల చేసిన మొత్తం గ్రాంట్ రూ.4.03256 కోట్లుగా కాగా ప్రాజెక్టు ఇప్పటి వరకు 57.92శాతం పూర్తయిందని చెప్పారు. 11.08.2025న జరిగిన జాతీయ ప్రాజెక్టు అప్రూవల్ కమిటీ(ఎన్‌పీఏసీ) సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2026 వరకు ప్రాజెక్టు పూర్తికి గడువు పొడిగించారని అభ్యర్థించగా 21.08.2025న ఆమోదం లభించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ నివేదనల ప్రకారం కోవిడ్-19 మహమ్మారి ప్రభావం, టెండర్లు, సేకరణ ప్రక్రియలో జాప్యాలు ఆలస్యానికి కారణాలుగా చెప్పారు.

## వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా వీరి చలపతిరావు



**కొడవలూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త :** వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా వీరి చలపతిరావును నియమిస్తున్నట్లు వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాజీ మంత్రి నలపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నేతృత్వంలో ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల మధ్యలో ఉంటూ సమస్యలపై నిరంతరం పోరాడి పరిష్కరించే నాయకుడిని మాజీ ముఖ్యమంత్రి జనగ్‌మోహన్ రెడ్డి గుర్తించి రాష్ట్ర కార్యదర్శి పదవి బాధ్యతలు అప్పగించడం సంతోషకరమైన విషయమని కొడవలూరు వైకాపా మండల నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

## విద్యార్థులలో నైతికత, క్రమశిక్షణ, సమాజం పట్ల గౌరవం పెంపొందించే విధముగా చాగంటి ప్రవచానాలు

**- పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కస్తురిభా కళా క్షేత్రములో ప్రవచనం నిర్వహణ - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**





**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** విద్యార్థులలో నైతికత, క్రమశిక్షణ, సమాజం పట్ల గౌరవం పెంపొందించే విధంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ప్రవచానాలు ఎంతో ఉపయోగపడతాయని, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆద్వర్యంలో స్థానిక కస్తురిభా కళా క్షేత్రంలో విలువల విద్యా సదస్సు పై ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావుచే ప్రవచనం నిర్వహించారు. సరస్వతి విగ్రహానికి పూలమాలు వేసి అనంతరం జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాటశాల విద్యా శాఖల అభివురుద్ధికి తగు సూచనలు, సలహాలు కొరకై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు సేవలు వినియోగానికై వారిని ప్రభుత్వ సలహాదారునిగా నియమించినదని తెలిపారు. భారతీయ సనాతన ధర్మాలతోపాటు, తల్లి తండ్రులు, గురువుల పట్ల నైతిక విలువలు తెలియచేసి విద్యార్థులలో అవగాహన అవసరం అన్నారు. ప్రభుత్వ సలహా దారునిగా ఆయన ఆలోచనలు, అనుభవాలు ఎంతో ఉపయోకరమని తెలిపారు. వారి ప్రవచనాలు జీవన మార్గ దర్శకమని, సమాజ మార్పునుకు ఉపయోగపడతాయని అన్నారు. జ్ఞానం మార్గాన్ని, విలువలు గమ్యానికి చేరుస్తాయని ఆయన తెలిపారు. ఉపాద్యాయులు, విద్యా వేత్తలు విద్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. యస్‌సిఈఆర్‌టి డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విలువలు, విద్యా సదస్సు కర్త , కర్మ ప్రవచన వాచస్పతి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు అని హృదయ పూర్వక పాదాభివందనాలు తెలిపారు. వారి ప్రవచనాలు నెల్లూరులో నిర్వచించుకోవడం గొప్ప విషయమని పరోక్షంగా వారి ప్రవచనాలు వినడమే అని నేడు ప్రత్యక్షంగా వినడం సంతోషదాయకం అన్నారు. విలువలతో కూడిన విద్యనూ అందించడం కోసం వారిని ప్రభుత్వం సలహాదారునిగా నియమించినదని కొనియాడారు. వారు 1958వ సంవత్సరములోతండ్రి సుందర శివ రావు, సుసీలమ్మకు జన్మించారు.వారు 42 రోజులలో రామాయణం, భాగవతం, 30 రోజులలో శివ పురాణం పూర్తి చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ యఫ్‌సిఐలో పనిచేస్తూ పదవీ విరమణ పొందారన్నారు. వారు ప్రవచానలు ఉచితముగా చేస్తారన్నారు. అంతే కాకుండా సాప్‌లో రాయబారిగా ఉన్నారని, ధర్మ నిబద్దత నిలువెత్తు రూపం అని కొనియాడారు. అనంతరం చాగంటి కోటేశ్వర రావు విలువలు విద్యా సదస్సు పై సుమారుగా 45 నిముషాల పాటు పిల్లలను, ఉపాధ్యాయులను, పిల్లల తల్లి తండ్రులను ఉద్దేశించి ప్రవచించించి అందరిని అలరించారు. ఈ కార్యక్రమ అనంతరం పలువురు విద్యార్థిని విద్యార్థులు నవ్యశ్రీ, సందీప్, మేఘన, ఆస్మిన్, ధనలక్ష్మి, నిఖిల్ అడిగిన ప్రశ్నలకు పిల్లలకు అర్థమయ్యేలా వివరముగా వివరించారు. తదుపరి శ్రీ చాగంటి కోటేశ్వర రావును సముచిత రీతిలో సత్కరించారు. జిల్లా విద్యా శాఖాధికారి వందన సమర్పణ చేసారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలాకులు లింగేశ్వర రెడ్డి, విద్యాశాఖాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## "యా అల్లా" సేవ్ కలువాయి





**కలువాయి డిసెంబర్ 11 ప్రభాతవార్త** అన్ని విధాల రుణాను బంధంతో నెల్లూరు జిల్లాతో కలిసి ఉన్న కలువాయి మండలాన్ని తిరుపతిలో కలిపి ముంచకండి మమ్మల్ని నెల్లూరులోని వుంచి బ్రతకనివ్వండి అంటు కలువాయి సేవ్ నినాదంతో రిలే నిరాహార్‌దీక్షలు పాల్గోన్న ముస్లీం మైనార్టీ నాయకులతోపాటు పలువర్గాల నిరసన కారులు ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లీం మైనార్టీ సోదరులు " యా అల్లా " సేవ్ కలువాయి అంటు అల్లాను ప్రార్ధించారు. కలువాయి బస్టాండ్ కూడలి నందు 3 వ రోజు గురువారం నిరసన కారులు పెద్దఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఎన్నో తరాల నుండి నెల్లూరు జిల్లా వాసులము అని చెప్పుకునే మేము ఇక్కడ మాకు అన్న ఆత్మీయ అనుబంధాలు వున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లా మాకు చాలాదూరం ,జిల్లా స్థాయిలో ఏ కార్యాలయానికి వెళ్ళాలన్న కనీసం 150 కిలోమీటర్లు వెళ్ళాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.నాయకులు ,అధికారులు ఇటువంటి పని చేసేటప్పుడు ఆప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని అన్నారు. ప్రత్యేకంగా 100 సంవత్సరాలు వయస్సుపైగలిగిన సయ్యద్ ముర్తుజా అనే వృద్దుడు కూడా రిలేనిరాహార దీక్షలు పాల్గోని మద్దతు తెలిపారు.

**కలువాయి సేవ్ ఉద్యమం కోసం పాట విడుదల**

మండలంలోని సీతారామ పల్లి గ్రామానికి చెందిన మహేష్ అనే యువకుడు కలువాయి సేవ్ ఉద్యమం కోసం కదలింది-కదిలింది కలువాయి మండలం కలసి అడుగు వేస్తుంది ఈ జనసమోహం తిరుపతి వద్దంటు-నెల్లూరు ముద్దంటు-కలిసి పోరాడదాం మన ఉనికిని కలువాయమ్మ దీవెనలు ఉంటే తప్పక విజయం మనదే గొంతెత్తి అడగనిదే ఆ నిర్ణయాలు ఆగవు పలకండి,పలకండి సేవ్ కలువాయి,సేవ్ కలువాయి అనే పాటను సభా ప్రాంగణంలో విడుదల చేయగా ఈ సందర్బంగా ఉద్యమకారులు మహేష్‌ను అభినందించారు.ఈకార్యక్రమాలలో మండలంలోని తిరుమళ్ళపాడు,లలితానగర్,గోపవరం,దాసరి పల్లి నుండి నాయకులు ప్రజలు మద్దతు తెలిపారు.

## కొనసాగుతున్న అర్ధరాత్రి తనిఖీలు



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు శాంతిభద్రత పరిరక్షణ, రాత్రి వేళల్లో నేరాల నివారణ, ప్రజల్లో భద్రతా భావం పెంపు కోసం జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ చేపడుతున్న తనిఖీలు బుధవారం అర్ధరాత్రి కొనసాగాయి. ముఖ్యంగా అల్లరి మూకలు, గ్యాంగులు, రౌడీ మూకలు తిరగబోయే ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ నిర్వహించారు. గుర్తింపు లేని వ్యక్తులు, స్ట్రేంజర్స్, అనుమానాస్పద వ్యక్తుల వివరాల సేకరణ, సరైన ఐడీ ప్రూఫ్ లేకుండా ఉండేవారి పై విచారణ చేసి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. రాత్రివేళ తిరుగుతున్న వ్యక్తులను ఆపి, వారి గమ్యం, కారణాలు విచారించారు. స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేని వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే లాఠీ ఝులిపిస్తూ గస్తీ చేసి రాత్రి వేళల్లో ప్రజలకు భయం లేని వాతావరణం సృష్టించడమే కర్తవ్యం గా పోలీసులు విధులు నిర్వహించారు. ప్రజలు రాత్రివేళల్లో సురక్షితంగా ప్రయాణించేలా సమగ్ర భద్రతా చర్యలు తీసుకున్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, మార్కెట్ ఏరియాలు, చీకటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కీలక జంక్షన్ల వద్ద ఆకస్మికంగా తనిఖీలు చేసి అనుమానాస్పద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రావెలర్ వాహనాలపై ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనం నడిపిన డ్రైవర్లపై ఎంవీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి వాహనాల సీజ్. బార్లు, రెస్టారెంట్లు మూసిన తరువాత బయటకు వస్తున్న వ్యక్తులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ చేసి, ఓపెన్ డ్రింకింగ్ 29 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ 15 కేసులు, ఇ చలానా కేసులు 131 నమోదు చేసి రూ.93,935లు ఫైన్ విధించారు.

## నేడు సేవ్ రాపూరు అంటూ కోవ్వోత్తుల ర్యాలీ

**రాపూరు,డిసెంబరు11ప్రభాతవార్త** తిరుపతి జిల్ల వద్దు.. నెల్లూరు జిల్లా ముద్దు అనే నినాదంతో సేవ్ రాపూరు అంటూ శుక్రవారం సాయంత్రం రాపూరులో పెద్ద ఎత్తున కోవ్వోత్తుల ర్యాలీకి రాపూరు జెఏసి పిలుపునిచ్చింది. రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలన్న ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కోవ్వోత్తుల ర్యాలీ అనంతరం అన్ని వర్గాల వారితో సమావేశం నిర్వహించి రాపూరును నెల్లూరు జిల్లాలో వుంచాలంటూ రిలే నిరాహార దీక్షలు చేయాలన్న అంశాన్ని చర్చించున్నుట్లు తెలిపారు.

**రాపూరును తిరుపతిలో కలపడంపై అధికార, ప్రతిపక్షాల మౌనం**

అయితే రాపూరు,కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ మూడు మండలాలల్లోని ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నప్పటికి ఇప్పటి వరకు అధికార పార్టీ కాని ప్రతిపక్ష పార్టీ నేతలు కాని దీనిపై స్పందించడం లేదు. ప్రధానంగా ఈ జిల్లా మార్పుకు కారణం సైదాపురం మండలంలో వున్న వేల కోట్ల రూపాయిల క్వాడ్జ్ అని ప్రజలు భావిస్తున్నారు. ఎవ్వరో నేతల ఆర్థిక లాభాల కోసం ప్రజలకు అనువుగా వున్న ఈ మండలాలను తిరుపతిలో కలిపి ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరికాదన్న విమర్శలు ప్రజలు నుండి వ్యక్తం అవుతున్నాయి. గత కోన్ని రోజులుగా జిల్లా మార్పుకు వ్యతిరేకంగా రాపూరులో విద్యార్థులు, యువకులు స్వచ్ఛందంగా జెఏసిగా ఏర్పాడి పోరాడుతున్నప్పటికి అధికార ప్రతిపక్ష నేతలు దీనిపై స్పందించక పోవడమేమిటన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ప్రభుత్వ నిర్ణాయానికి వ్యతిరేకంగా అధికార పార్టీ ఎమ్మెల్యే అయిన తాను ఎందుకు మాట్లాడటం అని దీనిపై ఆయన ఎమి మాట్లాడటం లేదు. ప్రతిపక్ష పార్టీ నేత అయిన వైసిపి వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి సైతం తనకు తిరుపతి జిల్లానే కావాలి కాని ప్రజల ఇష్టంతో తనకు పనిలేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు ఇరు పార్టీల ఆగ్రనేతలు తమ, తమ నాయకులను ఈ జిల్లా మార్పుకు వ్యతిరేకంగా మాట్లాడవద్దు అని గట్టిగా చెప్పినట్లు ప్రజలనుండి గుసగుసలు వినవస్తున్నాయి. అయితే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోని ఈ మూడు మండలాలను నెల్లూరులోనే కోనసాగించకుంటే మాత్రం అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఈ మూడు మండలాల ప్రజల మనస్సులో వ్యతిరేకతను ఎదుర్కోవలసి వస్తుంది.

## మంత్రినారాయణ ఇలాఖాలో... తెలుగుదేశం పార్టీకి భారీ షాక్

- దేశం నుండి వైకాపాలో చేరిన 5 మంది కార్పోరేటర్లు
- చక్రం తిప్పిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- కార్పోరేటర్లను పార్టీలోకి ఆహ్వానించిన వైకాపా అధినేత జగన్
- మరికొంత మంది కార్పోరేటర్లను ఆకర్షించే దిశగా చర్యలు



**నెల్లూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త-విద్య :** రాష్ట్ర మన్సిపల్‌శాఖమంత్రి , నెల్లూరు నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ సొంత నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి బారీ షాక్ తగిలింది. అధికార తెలుగుదేశం పార్టీని వీడి ఐదుమంది కార్పోరేటర్లు గురువారం నెల్లూరు నగర వైకాపా ఇన్‌చార్జ్, తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉండవల్లిలోని వైకపా అధినేత జగన్ నివాసంలో జరిగిన ఈ చేరికల్లో స్వయానా పార్టీ అధినేత జగన్ కార్పోరేటర్లకు కండువా కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. కాగా ఇంకోన్ని రోజుల్లో కార్పోరేషన్ మేయర్‌పై అవిశ్వాస తీర్మాణం పెట్టి ఆమెదించుకోవటం , నూతన మేయర్ ఎంపిక లను చేపట్టనున్న తరుణంలో అధికార తెలుగుదేశం పార్టీనుండి నెల్లూరు నగర నియోజకవర్గం పరిధిలోని 6వ డివిజన్ కార్పోరేటర్ మద్దినేని మస్తానమ్మ, 5వ డివిజన్ కార్పోరేటర్ ఓబిలి రవిచంద్ర, 51 డివిజన్ కార్పోరేటర్ కాయల సాహితి, 16వ డివిజన్ కార్పోరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం 34వ డివిజన్ కార్పోరేటర్ షేక్.షమిదాలు వైకాపాలో చేరటం తెలుగుదేశంకు భారీ షాక్‌ను కలిగించాయనే చెప్పాలి. అయితే వీళంతా గతంలో వైకాపా పార్టీలో ఉంటూ పార్టీ గుర్తుతో కార్పొరేటర్లుగా గెలిచిన వారే కావటం విశేషం. వైకాపా నుండి 18 నెలల క్రితం అనేకమంది కార్పోరేటర్లు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరారు. ప్రస్తుతం సొంత గూటికి చేరుకున్న కార్పోరేటర్లు 18 నెలలనుండి తమకు ప్రాధాన్యత లేకుండా పోయిందని, అందుకే తాము మళ్లీ వైకాపాలోకి రావటం జరిగిందని ప్రభాతవార్తకు తెలిపారు. ఇది ఇలా ఉండగా ప్రస్తుతం నెల్లూరు నగర కార్పోరేషన్‌లోని 54 టిడిజన్‌లలో తెలుగుదేశంకు 36 మంది కార్పోరేటర్ల బలం ఉండగా వైకాపాకు ఇప్పుడు చేరిన ఐదుమంది కార్పోరేటర్లతో కలిపి 17మంది సభ్యుల బలం ఉంది. కాగా నెల్లూరు నగర కార్పోరేటర్లను తిగిరి వైకాపాలోకి రప్పించటంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చక్రం తిప్పారని సమాచారం. వీరితో పాటూ మరో 8మంది కార్పోరేటర్లతో కూడా పర్వతరెడ్డి టచ్‌లో ఉన్నారని, మేయర్ ఎన్నికలకంటే ముందుగానే వారు కూడా వైకాపాలో చేరనున్నారని తెలుస్తుంది. మరి కొంత మంది కార్పోరేటర్లు మాత్రం చివరివరకు వేచి చూడాలని నిర్ణయించినట్టు తెలుస్తుంది. కాగా మిగిలిన కార్పోరేటర్లను చేజారి పోకుండా ఉంచుకునేందుకు మంత్రి నారాయణ ప్రధాన అనుచరులు క్యాంపు రాజకీయాలను ప్రారంబించారు. నెల్లూరురూరల్ లోపరిస్థితిని చేజారి పోకుండా కోటంరెడ్డి సోదరులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రభాతవార్తతో మాట్లాడుతు తమ కార్పోరేటర్లు తెలుగుదేశం పార్టీనుండి తిగిరి తమ వైకాపాలో చేరటం సంతోషంగా ఉందన్నారు. తెగుదేశం పరిపాలనలతో ప్రజలతోపాటూ నాయకులు కూడా అసంస్కృత్తిగా ఉన్నారన్నారు. ప్రస్తుత కార్పోరేటర్ల మాదిరిగానే మరి కొంత మంది వైకాపాలో చేరేందుకు సంసిద్దత వ్యక్తంచేశారని, త్వరలోనే ఆ చేరికలు కూడా ఉంటాయన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం ఇవ్వటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులను బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**




**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని నెల్లూరు, కందుకూరు, ఆత్మకూరు, కావలి డివిజన్లవారీగా నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్, ఎస్పీ కూలంకషంగా చర్చించారు. ప్రతి కేసు వివరాలను ఆయా డివిజన్ల డిఎస్పీలతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేసు నమోదైన వెంటనే ప్రాథమికంగా విచారణ చేపట్టి, చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. న్యాయపరంగా సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సెప్టెంబరులో 147 కేసుల్లో రూ.1.74 కోట్లు, నవంబర్‌లో 48 కేసులకు రూ.36.75 లక్షలు నష్టపరిహారంగా చెల్లించినట్లు చెప్పారు. ఇంకా 65 కేసులకు రూ.94 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ఈ నగదు కూడా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

**- ఎస్పీ డాక్టర్ అజితా వెజండ్ల మాట్లాడుతూ**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను రాజకీయాలు, పార్టీలకతీతంగా పారదర్శకంగా నమోదు చేస్తున్నామని చెప్పారు. ఎటువంటి అక్రమ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు అన్ని స్టేషన్ల పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. కేసుల విచారణలో వేగం పెంచినట్లు చెప్పారు. బాధితులందరికీ సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

**- ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ**

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ప్రతి కేసును పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన తీరు బాగుందని, ఇదేవిధంగా ఎప్పుడూ నిర్వహించాలని కోరారు. అన్ని కమిటీల కంటే డివిఎంసి కమిటీ చాలా కీలకమైనదని, అన్ని మండలాల తహశీల్దార్లు, స్టేషన్‌హౌస్ ఆఫీసర్లు కూడా హాజరయ్యేలా చూడాలని కలెక్టర్, ఎస్పీని కోరారు. మండలాల వారీగా సామాజిక భవనాల కోసం కేటాయించిన స్థలాలు, భవనాల మరమ్మతుల వివరాలను సేకరించి, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లాలోని పలు సమస్యలపై ప్రస్తావించారు. కేసుల విచారణ వేగవంతం, బాధితులకు నష్టపరిహారం, ఎస్సీ ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. చాలా కేసులు సంవత్సరాల తరబడి పెండిరగ్‌లో వున్నాయని, వెంటనే విచారణ వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సభ్యులు సూచించిన అన్ని సమస్యలపై కలెక్టర్, ఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు వంశీకృష్ణ, పావని, డిఎస్పీలు శ్రీనివాసరావు, వేణుగోపాల్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మురళీ, గంధళ్ల శ్రీరాములు, ప్రభాకర్, యేసేబుడి, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మిద్దెతోటలో సేంద్రియ ఎరువు తయారీపై శిక్షణ



**బిట్రగుంట డిసెంబర్ 11 ప్రభాతవా** ర్తకావలి మున్సిపాలిటీ పరిధిలో గురువారం మిద్దె తోట పై మొక్కల పెంపకం కోసం సేంద్రియ ఎరువుల తయారీ పై కావలి మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ బషీర్ శిక్ష ఇచ్చారు. ఈ శిక్షణలో బిట్రగుంట నుంచి ఎం కె ఎస్ స్కూల్ లో ఆరవ తరగతి చదువుతున్న నారాయణ నారాయణ శ్రీ ప్రణవి పాల్గొనగా అప్పుడే శిక్షణలో తయారుచేసిన సేంద్రియ ఎరువును సానిటరీ ఇన్స్పెక్టర్ అందజేశారు. ప్రతి ఒక్కరూ మిద్దెల పైన సేంద్రియ ఎరువులతో మొక్కలను పెంచి ఆకర్షణీయంగాను పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెంచాలని సూచించారు.

## జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియాను సరఫరా చేసేందుకు ఈ రబీ సీజన్‌కు ముందస్తు ప్రణాళికతో కార్యచరణ చేపట్టామని వ్యవసాయశాఖ జాయింట్ డైరక్టర్ పి.సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విదేశాల నుండి దిగుమతులు కూడా సంతృప్తికరంగా ఉన్నందున రాబోయే పంట కాలంలో కూడా యూరియా కొరత ఉండదని, రైతులు నమ్మకంగా వ్యవసాయ కార్యక్రమాలు కొనసాగించవచ్చని వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని పంటలకు అవసరమైన 94,383 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సిద్దంగా ఉంచామని వివరించారు. అక్టోబర్ 1నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలో 52,902 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే 42,834 మెట్రిక్ టన్నుల యూరియా సూరఫరా చేసుకోవడం జరిగిందన్నారు. 11వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 19000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 14,927 మెట్రిక్ టన్నుల యూరియాను కో- ఆపరేటీవ్ సొసైటీలు, రైతు సేవ కేంద్రాలు, మార్క్‌ఫెడ్ గోడౌన్ లు, రిటైల్ హోల్ సేల్, కంపెనీ గోడౌన్‌లలో అవసరం కంటే నిల్వలు అధికంగా అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

## ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైన ఎంఎస్‌ఎంఈలు ఎన్ని



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : దేశ వ్యాప్తంగా ఉద్యమ్ పోర్టల్ ప్రారంభమైన జులై 1, 2020 నాటి నుంచి నేటి వరకు నమోదు అయిన మొత్తం ఎంఎస్‌ఎంఈ లు ఎన్నని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు లోక్‌సభలో పలు అంశాలపై ఆరా తీశారు. అలాగే బీఎస్‌ఈ, ఎస్‌ఎంఈ, ఎన్‌ఎస్‌ఈ వంటి ప్లాట్‌ఫామ్‌లతో సహా స్టాక్ మార్కెట్ ఎక్స్ఛేంజీల జాబితాలో చేరిన ఎంఎస్‌ఎంఈల సంఖ్య ఎంత అని ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల సహాయ మంత్రి సుశ్రీ శోభ కరండ్లజే లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్, పోర్టల్ 01.07.2020న ప్రారంభించబడిందని, 30.11.2025 నాటికి పోర్టల్‌లో దేశంలో నమోదైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఖ్య 7.22 కోట్లు అన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2020-21 లో 64507, 2021-22లో 145720, 2022-23లో 243233, 2023-24లో 1314704, 2024-25లో 418041, 2025-26లో ఇప్పటి వరకు 462513 ఎంఎస్‌ఎంఈ లు నమోదయ్యాయని వెల్లడించారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబి) సమాచారం ప్రకారం ఏ ఎక్స్ఛేంజ్‌లోనూ ఎంఎస్‌ఎంఈ వర్గీకరణ సంగ్రహించబడలేదని స్పష్టం చేశారు. అయితే, ఎస్‌ఈబీఐ(మూలధనం, బహిర్గతం అవసరాలు(ఐసీడీఆర్)) నిబంధనల ప్రకారం బీఎస్‌ఈ లో 665, ఎన్‌ఎస్‌ఈలో 690 ఎంఎస్‌ఎంఈలు నమోదయ్యాయని తెలిపారు.

## బీసీ భవన్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : అమరావతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిర్మాణ దశలో ఆగిపోయిన బీసీ భవన్ పనులను మళ్లీ ప్రారంభించేందుకు అవసరమైన నిదులను మంజూరు చేయాలని కోరారు. నిర్మాణం ప్రారంభమైన తర్వాత మధ్యలో ఆగిపోవడంతో స్థానిక బీసీ సంఘాలకు ఇబ్బందులు ఎదురవుతూన్నయని వివరించిన గిరిధర్‌రెడ్డి. భవనాన్ని పూర్తి చేస్తే వేలాది మంది బీసీ వర్గాలకు ఉపయోగకరంగా ఉంటుందని మంత్రికి తెలిపారు. నిర్మాణానికి కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి పనులను వేగవంతం చేయాలని ఆయన అభ్యర్థించగా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం.

## మైనార్టీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి ఫారూక్‌ని అభ్యర్ధించిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ మహమ్మద్ ఫారూక్‌ని గురువారం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పలు కీలక విజ్ఞప్తులు చేశారు. అక్కచె రువుపాడు ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాల అదనపు మౌలిక వసతులు మంజూరు చేయాలని ఆయన కోరారు. అదే విధంగా నెల్లూరు రూరల్ పరిధిలోని గాంధీ నగర్‌లో నూతన క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, కొత్త షాదీ మంజిల్ ఏర్పాటు కోసం అవసమైన నిధులను ఆమోదించాలని ప్రతిపాదించారు. నవలాకుల గార్డెన్స్, జన్నత్ హుస్సేన్ నగర్‌లలో నిర్మాణ దవలో ఆగిపోయిన షాదీ మంజిల్స్‌ను పూర్తి చేయడానికి గాను కూడా తగిన నిధులు విడుదల కోరారు. నియోజకవర్గ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమం, విద్యా వసతుల బలోపేతం కోసం చేసిన ఈ విజ్ఞప్తులపై మంత్రి ఫారూక్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## వేదయపాలెం పోలీసు స్టేషన్ విభజనకు టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి విజ్ఞప్తి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన కీలక ప్రజా సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వేదయపాలెం 5వ పట్టణం పోలీసు స్టేషన్ పరిధి విస్తారంగా ఉండటం వల్ల శివారు ప్రాంతాల్లో చట్టవ్యవస్థను సమర్ధవంతంగా పర్యవేక్షించడం పోలీసులకు కష్టతర మవుతున్న నేపథ్యంలో స్టేషన్ పరిధిని విభజించి రెండు ప్రత్యేక పోలీసు స్టేషన్లుగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రాంతంలో పెరుగుతున్న గంజా యి రవాణా, అపరాధ కార్యకలాపాలు, శాంతి భద్రతల నిర్వహణకు ఈ విభజన ఎంతో కీలకమని గిరిధర్‌రెడ్డి మంత్రి అనిత కి తెలుపుతూ తక్షణ చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు.

## కొండాపురంలో విధ్యార్దులకు "రక్తనమూనా "పరీక్షలు




**కలిగిరి, డిశెంబర్11, ప్రభాతవార్త** ; మండల కేంద్రమైన కొండాపురం హైస్కూల్లో విధ్యార్దులకు గురువారం "రక్త నమూనానిర్దారణ "పరీక్షలునిర్వహిం చారు.ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలు 6వ తరగతినుండి 10వ తరగతి విధ్యార్ద లకు నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కొండాపురం మండల కన్వీనర్ తాడికొండ నవీన్ ఆద్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సుమారు120మందికి పైగా విధ్యార్దులకు రక్తనమూనా నిర్దారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్బంగా కన్వీనర్ తాడికొండ నవీన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ రక్తనమూనా పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు.

ఆపద్దతిని విధ్యార్ది దశనుండే నేర్చుకోవాలన్నారు.రక్తవర్గ నిర్దారణ వల్లఅత్యవసర సమయంలో మీకు రక్తం అవసరమైనప్పుడు బ్లడ్ గ్రూప్‌తెలుసుకొని ఉండడం మంచిదన్నారు.ఈ సందర్బ ంగా విధ్యార్దులకు రక్త దాన ఆవశ్యకతను తెలియ జేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాదాక్రిష్ణ మాట్లాడుతూ ప్రతివ్యక్తి తనరక్త వర్ణం తెలుసుకోవడం కనీసభాద్యత అన్నారు.రక్త గ్రూపులను తెలుస ుకోవ డమే కాకుండా ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేయడం దేవుడు ఇచ్చిన వరమన్నారు.ఈ కార్యక్ర ర మంలో ఉపాధ్యాయులు,రెడ్‌క్రాస్ శిబ్బంది పద్మ, శేషమ్మ, అనీల్, తల్లిదండ్రులు, విధ్యార్దులు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడీ సాయి మందిరంలో అభిషేక పూజలు



**కోవూరు, డిసెంబరు11 ప్రభాతవార్త** : కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న శ్రీ షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చ కులు జగదీష్ స్వామి అభిషేక పూజలను సాంప్ర దాయ బద్ధం గా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నైపుణ్యాల అభివృద్ధి పరిచేలా గణిత బోధన చేయాలి



**ఉదయగిరి, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు గురువాం 100 డేస్ ఫ్రోగ్రాం అమలు పరిశీలనలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంగళరావునగర్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 8 నుండి 9 గంటల వరకు జరిగే గణిత బోధన సీ, డీ గ్రేడ్ విద్యార్థులు(రైజిగ్ స్టార్స్) కు ఏ, బీ గ్రేడ్ విద్యార్థులకు(షైనింగ్ స్టాస్) జరిగే బోధనను పరిశీలించి గణిత ఉపాధ్యాయురాలు సునందని ప్రత్యేకంగా అభినందించారు. తదుపరి పాఠశాల అసెంబ్లీకి హాజరై విద్యార్థుల భద్రతా ప్రతిజ్ఞను చేయించి దాని ఆవశ్యకతను రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడం, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత డ్రైవింగ్, అలవాట్లు హెల్మెట్ ధరించడం బెల్ట్ ధరించడం తదితర అంశాలపై ఉపాధ్యాయులకు విద్యార్థులకు, అవగాహన కల్పించారు. పాఠశాల అకడమిక్ అభివృద్ధి చూసి పాఠశాల హెడ్ మాస్టర్ హసీనాని రమేష్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్టకూరును కలిసిన రాధాకృష్ణ నాయుడు

**వెంకటాచలం డిసెంబర్ 11 ప్రభాతవార్త** : సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మెట్టకూరు ధనంజయ రెడ్డిని చవటపాలెం సహకార సంస్థ ఛైర్మన్ రావూరు రాధాకృష్ణ నాయుడు గురువారం సెంట్రల్ బ్యాంకు కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. ఇరువురు కొంతసేపు సొసైటీ అభివృద్ధి గురించి చర్చించుకున్నారు.

## జి.ఎఫ్.ఎల్.ఎన్ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయండి



**రాపూరు,డిసెంబరు11ప్రభాతవార్త** : రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జి.ఎఫ్. ఎల్.ఎన్ 75 రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని కాంప్లెక్స్ హెచ్‌యం వి. అనీల్ కుమార్ సూచించారు. గురువారం రాపూ రులోని న్యూ ఎస్.సీ కాలనీ పాఠశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. జి.ఎఫ్.ఎల్.ఎన్ ప్రణాళిక ప్రకారం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలన్నారు. జూదాయి పితారా కిట్‌ను పరిశీలించారు. భౌతికాభి వృద్ధి అక్టివిటీస్ పరిశీలించారు. పిల్లల సామర్థ్యం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌పి మురళీ, విద్యార్థులు తదితరులున్నారు.

## చేనేత కార్మికులకు నెస్లే ఫ్లడ్ రిలీఫ్ డిస్టిబ్యూషన్



**బుచ్చి డిసెంబర్ 11 ప్రభాతవార్త** : బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని చేనేత కార్మికులకు నెస్లే ఫ్లడ్ రిలీవ్ డిస్టిబ్యూ ్యషన్ వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా మం డలంలో 65 మందికి 12 రకాల నిత్యావసర సరుకులు, పదికేజి బియ్యం అందజేశారు.ఈ సందర్బంగా చేనేత శాఖ రాష్ట్ర డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే కష్టకాలంలో తమకు అండగా నిలబడ్డ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కూడా ఆయన ప్రత్యేంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు పాల్గొని సామగ్రిని చేనేత కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో నెస్లే కంపెనీ ప్రతినిధి రమేష్, చేనేత జౌళశాఖ ఏడిఒ రజనికుమారి,టిడిపి నగర్ అద్యక్షులు గుత్తా శ్రీనయ్య, బిజెపి నాయకులు రామిశెట్టి కళ్యాణ్, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, వద్ది వెంకటేశ్వర్లు,కొలమల వెంకటేశ్వర్లు, గుంటూరు ప్రసాద్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



**బిట్రగుంట డిసెంబర్ 11 ప్రభాతవార్త** : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని కొత్తూరు గ్రామంలో బ్రహ్మంగారిమఠం వద్ద రోడ్డు అద్వాన స్థితిలో ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తుల శ్రమదానంతో చందాల రూపంలో వసూలు చేసుకుని రోడ్డు నిర్మించుకున్నారు. ఈ ప్రాంతానికి తాము వీధిలైట్లు కూడా అమర్చుకున్నట్లు వారు పేర్కొన్నారు. దీంతో కొంతకాలంగా తాము పడుతున్న ఇబ్బందుల్ని అధికమించినట్లు వారు పేర్కొన్నారు .

## ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులచే ప్లాస్టిక్ వాడకంపై అవగాహన



**బిట్రగుంట డిసెంబర్ 11 ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల స్పెషల్ క్యాంపులో భాగంగా రెండవ రోజు గురువారం కొండ బిట్రగుంట గ్రామంలో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రజలతో కలిసి మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ లేదా నారసంచులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్‌ను వాడకం వల్ల కేన్సర్ భారిన పడే అవకాశముందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వల్ల భూమి, నీరు, గాలి, కాలుష్యం అవుతున్నాయని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మన వంతు గా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపేసి ప్రత్యామ్నాయం చూసుకోవాలని కోరారు. తదనంతరం ఏకో ఫ్రెండ్లీ బ్యాగ్స్ గ్రామ ప్రజలకు ఇంటింటికి పంచుతూ ప్లాస్టిక్ సంచి వద్దు గుడ్డసంచే ముద్దు అంటూ వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఏ కిరణ్ కుమార్, గ్రామ ప్రజలు, పాఠశాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 1 వవార్డు కట్టుబడిపాళెంలో ప్రశాంతమ్మ ప్రజా పాలన సమస్యల పరిష్కార వేదిక



**బుచ్చి డిసెంబర్ 11 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో 1వవార్డులోని కట్టుబ డిపాళెంలో ప్రశాంతమ్మ ప్రజాపాలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించ ారు. ఈకార్య క్రమంలో ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ మాట్లాడుతు ప్రజల సమస్యలు తెలుసు కునేందుకు ప్రతి వార్డుకు వెళ్లాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలు స్వీకరించి ఆ అర్జీలకు సంబందించి విషయాలను ఆయా శాఖలకు పంపించి పరిష్కరిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఛైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, ఒకటో వార్డు కౌన్సిలర్ కత్తి నాగరాజు, టౌన్‌అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయు డు,టిడిపి,బిజెపి,జనసేన నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో కారుణ్య నియామకం



**నెల్లూరు, కలెక్టరేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : కారుణ్య నియామకం ద్వారా ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గురువారం తన చాంబర్లో నియామక ఉత్తర్వు లను అందించారు. ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తూ మృతి చెందిన పెంచలయ్య కుమార్తె లక్ష్మి ప్రసన్నకు పోలీస్ డిపార్ట్మెంట్లో మహిళా పోలీస్‌గా నియామక ఉత్తర్వులు అందించారు. విధుల పట్ల అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ విజయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో తుమ్మా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌ఎఫ్‌సిఓ కిసాన్ ప్రత్యేక ఆర్థిక మండలికి కేబినెట్ ఆమోదం

**– నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక పురోగతికి నూతన శకం – జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** ఇఫ్కో కిసాన్ ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుతో నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక పురోగతికి నూతన శకం ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. నెల్లూరు జిల్లా రాచర్లపాడు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్కో కిసాన్ ప్రత్యేక ఆర్థిక మండలి గురువారం జరిగిన క్యాబినెట్‌లో ఆమోదించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఐఎఫ్‌ఎఫ్‌సిఓ కిసాన్ సెజ్ లిమిటెడ్ సంస్థ నెల్లూరు జిల్లాలో 2,776 ఎకరాల్లో మల్టీ-ప్రొడక్ట్ స్పెషల్ ఎకనామిక్ జోన్‌ను అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం రూ.870 కోట్ల పెట్టుబడులతో మౌలిక వసతులు కల్పించనున్నారు. ఈ సెజ్ ద్వారా ప్రత్యక్ష 30 వేలు, పరోక్షంగా 40 వేలు మొత్తం కలిపి సుమారు 70,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అదనంగా మరిన్ని యూనిట్లు స్థాపించబడితే 29,400 మందికి ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇప్పటికే మూడు ప్రధాన సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఎంఓయులు కుదుర్చుకున్నాయి. మరికొంత మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ సెజ్ నెలకొనడం వల్ల ఎంఎస్‌ఎంఈ/ఎస్‌ఎంఈ పరిశ్రమలకు మంచి అవకాశాలు లభించడంతో పాటు ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో స్థానిక ప్రజలకు భారీ ఉపాధి, వ్యాపార అవకాశాలు, ఆర్థికాభివృద్ధి వంటి ప్రయోజనాలు కలుగనున్నాయని తెలిపారు. పార్క్ పూర్తి అభివృద్ధితో కావలి – నెల్లూరు మధ్య కీలక ఆర్థిక కారిడార్‌గా మారనుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## సఫాయి కర్మచారీల సంక్షేమానికి మొదటి ప్రాధాన్య

**– జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : సఫాయి కర్మచారీల ఆరోగ్య భద్రత, సంక్షేమాన్ని ఒక బాధ్యతగా భావించి పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మాన్యువల్ స్కావెంజర్స్ యాక్ట్‌పై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ఉద్దేశం, కమిటీ దృష్టికొచ్చిన అంశాలను, గత సమావేశంలో చర్చించిన విషయాలను సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ సఫాయి కర్మచారీల సంక్షేమానికి అన్నిశాఖల అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాన్యువల్ స్కావెంజర్స్ యాక్ట్‌ను ప్రభుత్వం మార్గదర్శకాలు మేరకు పక్కాగా అమలు చేయాలని సూచించారు. కమిటీలోని సభ్యులందరూ మాన్యువల్ స్కావెంజర్స్ సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మెప్మా పిడి లీలారాణి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ లేబుళ్లతో వినియోగదారులకు మోసం



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** కంపెనీతో సంబంధం లేకుండా నకిలీ ఎంఆర్‌పి ధరలు అతికించి ఫేస్‌క్రీమ్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఓ ప్రముఖ కంపెనీకి చెందిన ఫేస్‌క్రీమ్ రూ. 699 ఉండగా స్టిక్కర్‌ను తొలగించి రూ.1699 లకు విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపధ్యంలో గురువారం విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా చిన్నబజారులోని సావన్ కాస్మొటిక్ దుకాణంలో తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో తయారీ తేదీ లేకుండా, గడువు తేదీ ముగిసిన వస్తువులు సైతం విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ దుకాణానికి లేబుళ్లను సరఫరా చేసిన ట్రంకు రోడ్డులోని ఆర్కే జిరాక్స్ సెంటర్ పై కూడా అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముద్రించడానికి సిద్ధంగా ఉన్న పలు స్టిక్కర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సావన్ దుకాణంలోని సరుకును సీజ్‌చేసి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదుకు సిఫార్సు చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహరావు తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీటివో విష్ణురావు, సీఐ శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యరహిత సమాజ నిర్మాణం విద్యార్థుల బాధ్యత



**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త** : విద్యార్థులకు ర్యాగింగ్ మొదటి శత్రువు ఐతే, మాదకద్రవ్యాలు రెండవ శత్రువు అని కావలి రెడ్‌క్రాస్ అద్యక్షులు, ఆర్డీఓ పేర్కొన్నారు. పీబీఆర్ విశ్వోదయ ఇన్‌స్టూట్‌ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో గురువారం బారీ యాంటీ డ్రగ్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆర్డీఓ సన్నీవంశీక్రిష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం యొక్క చట్టపరమైన మరియు సామాజిక పరిణాలను, అలాగే ర్యాగింగ్ కార్యకలాపాలపై కఠినమైన చర్యలను గురించి వివరించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనీల్‌కుమార్ మాట్లాడుతూ సురక్షితమైన మాదకద్రవ్యాలు లేని, మరియు సహాయకారిగా ఉండే అకడమిక్ వాతావరణాన్ని నిర్ధారించడానికి సంస్థల తీసుకుంటున్న చర్యలను వివరించారు. కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు ప్రముఖ వైద్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాదకద్రవ్యాలు ఆరోగ్యంపై చూపే ప్రభావం, నషా టలను వివరించారు. ప్రముఖన్యాయవాది, మాజీ ఏజిపి పొట్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ యాంటీ ర్యాగింగ్ యాంటీ డ్రగ్స్ చట్టాలకు సంబంధించిన న్యాయపరమైన చర్యలు శిక్షలు జరి మానాలు మరియు విధానాల గురించి వివరించారు. రెడ్‌క్రాస్ సభ్యులు రవిప్రకాష్, ప్రసన్నకుమార్, ఎన్.ప్రణీత్, జి.హరనాథ్, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాకటర్ ఎండి హయత్‌రజ్వీ యాంటి ర్యాగింగ్ సెల్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.ఈశ్వరయ్య రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు హరినార పరెడ్డి, అరికట్ల మధుసూదన్‌రావు, గొట్టిపటి మనోరమ, సభ్యులు బెజవాడ అభిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బోగోలు చెరువు కలుజు ధ్వంసం



**బిట్రగుంట డిసెంబర్ 11 ప్రభాతవార్త** : బోగోలు సాగునీటి చెరువు దక్షిణ కలుజు ధ్వంసం ఆక్రమణదారుల పనేనని, తక్షణం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, నీరు వృధా కాకుండా తక్షణ మరమ్మత్తులు చేపట్టాలని బోగోలు చెరువు సాగునీటి సంఘం సభ్యులు, రైతులు ఇరిగేషన్ ఏఈ జితేంద్ర రెడ్డికి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఏఈ చెరువు కలుజును మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మాలపాటి నాగేశ్వరరావు తో కలిసి పరిశీలించాడు. వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపడుతామని, వేసవిలో నీళ్ల తగ్గిన తరువాత శాశ్వత మరమ్మతులు చేస్తామన్నారు. అయితే బోగోలు చెరువు లోతట్టు ప్రాంతాలలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కొందరు వ్యక్తులే ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారని రైతులు ఆరోపిస్తున్నారు. పై కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు శ్రీధర్ పలువురు రైతులు ఉన్నారు.

## మహిళలకు ప్రత్యేక బస్సులు నడపాలి



**ఉదయగిరి, డిసెంబర్ 11, ప్రభాతవార్త** : ఏపీఎస్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మహిళలకు ప్రత్యేక ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరక్టర్ గడియాల్చి ఎస్దాని, ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మగవారికి సీట్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మగవారైన వయోవృద్దులు, అనారోగ్య సమస్యలతో ఉన్న వారు బస్సు ఛార్జీలు చెల్లిస్తూ కూడా సీట్లు లేక ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. ప్రభుత్వం వారు తగిన చర్యలు తీసుకుని మహిళలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని లేదా బస్సుల్లో మగవారికి ప్రత్యేక సీటు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోండి



**నెల్లూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త -వైద్యం** : నెల్లూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వల్లి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో ఉన్నటువంటి స్థానిక బీవీ నగర్లోని డామేన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ లో టీబీ నివారణ సిబ్బందితో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి మాట్లాడుతూ టీబీ నివారణ సిబ్బంది అందరూ క్షేత్ర స్థాయిలో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, క్షేత్ర స్థాయిలో టీబీ పేషెంట్లకు అందుతున్న సేవల గురించి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ గురించి టీబీ యూనిట్ వారీగా సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి టీబీ సూపర్‌వైజర్, ల్యాబ్ సూపర్‌వైజర్లు, టీబీహెచ్‌వీలు, డిస్టిక్ సూపర్‌వైజర్స్ స్టాఫ్, భవ్య సిబ్బంది, డ్యామేన్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## విక్రమ సింహపురి యూనివర్సిటీలో స్టార్టప్ ల పై వారం రోజుల సామర్థ్య నిర్మాణ సదస్సు ప్రారంభం




**వెంకటాచలం డిసెంబర్ 11 ప్రభాతవార్త :** తేది: 11.12. 2025 శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా కాకుటూ రులోని విక్ర మ సింహపురి యూనివ ర్సి టీకి చెందిన టూరిజం మేనే జ్మెంట్ విభాగం ఆధ్వర్యం లో "Capacity Building Program on Entrepreneurship Startup Development - From Idea to Execution" పేరుతో విద్యార్థులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు గారు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సుకు టూరిజం మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి.సుజాత కోఆర్డినేటర్గా వ్యవహరిస్తున్నారు.ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడు తూ,యువతలో స్టార్టప్లపై పెరుగుతున్న ఆసక్తి పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒక ఆలోచనను విజయవ ంతమైన వ్యాపారంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి సామర్థ్య నిర్మాణ (Capacity Building) కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం సంప్రదాయ ఉద్యోగా లపైనే ఆధారపడకుండా, తమ సృజనాత్మకత, నైపుణ్యాలను ఉపయోగించి కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు. స్టార్టప్లలో విజయం సాధించాలంటే మార్కెట్ అవగాహన, స్పష్టమైన ప్రణా ళిక, టీమ్వర్క్, నిరంతర నవోత్తర ఆలోచనలు కీలకమని వీసీ వెల్లడించారు. విద్యార్థుల్లో వ్యాపార ధోరణిని పెంపొందించేందుకు విశ్వ విద్యాలయం అన్ని విధాలా సహకరిస్తుందని, మంచి స్టార్ట్ అప్ ఐడియా తెచ్చిన విద్యార్థులకు ఆర్థిక సహకా రం అందించి ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి కీలకోపన్యా సకులుగా(Keynote Speaker) పాల్గొన్న వెంకటేశ్వర యూనివర్సిటీ రూసా సీఈఓ వంశీ కృష్ణరాయల మాట్లాడుతూ స్టార్టప్ల ప్రాముఖ్యత, వ్యాపార ఆలోచనలను అమలు దిశగా తీసుకెళ్లే వ్యూహా లు, ప్రస్తుత పారిశ్రామిక రంగంలో ఉన్న అవకాశాల గురించి విలువైన సూచనలు అందించారు. కార్యక్ర మంలో విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొని, స్టార్టప్ ప్రారంభ పద్ధతులు,వ్యాపారనమూనాలు,పెట్టుబడిదారులతో కమ్యూనికేషన్ వంటి అంశాలపై ప్రశ్నలు అడగగా,రాయల వాటికి సమగ్ర వివరణలతో సమాధా నమిచ్చారు.

- అనంతరం సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాత ఆధ్వర్యంలో టూరిజం మేనేజ్మెంట్ విభాగ అధ్యాపకులు అతిధులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.
- సదస్సు కోకోఆర్డినేటర్ గా విక్రమ కుమార్ వ్యవహరించారు. టూరిజం విభాగ అధ్యాపకులు ఆచార్య జవహర్ బాబు, డాక్టర్ త్యాగరాజు, డాక్టర్ నీలమణికంట, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు



**బుచ్చి డిసెంబర్ 11 ప్రభాతవార్త** బుచ్చిరెడి పాళెం లోని సెయింట్ మ మేరీస్ జూనియర్ కళాశాల నందు 69 వ రాష్ట్రస్థాయి ఎస్జిఎఫ్ 14 సంవ త్సరాల బాలబాలికలకు పెన్సింగ్ క్రీడా పోటీలు ఈనెల 9,10,11 తేదిలలో నిర్వహిం చడం జరిగింది.ఈక్రీడా పోటీలకు ఉమ్మడి రాష్ట్రం లోని 13 జిల్లాల బాలబాలికల క్రీడాకారు లు పాల్గొన డం జరిగింది. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్ నెల 21,22,23 24,25 తేదిలలో మ హారాష్ట్ర లో జరుగు జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని జిల్లా ఎస్జిఎప్ కార్యదర్శి భీమతాటి వెంకటర మణయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో ఎం.దేవిక, టోర్నమెంట్ అబ్జరవర్ భవానీ, వ్యాయామ ఉపాధ్యా యులు సుబ్బారావు, మహేష్, మల్లికార్జున, మధుసూదన్రావు, గురవయ్య, రాజేష్,ఆరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబాకు ప్రత్యేక పూజలు



**విడవలూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో వెలసియున్న సాయిబాబాకు గురువారం విశేష పూజలు నిర్వహి ంచారు. స్వామివారికి ఉదయం అభిషేకం, అర్చనలు అర్చకుల చే అత్యంత వైభవంగా నిర్వహించారు. భజన భక్త మండలి వారిచే భక్తిగీతాలు ఆలపించి పల్లకిసేవ, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. భకుతలు స్వామివారిని దర్శించు కొని తీర్థప్ర సాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమాలకు ఉభయ కర్తలుగా గుడ్లూరు రాజేష్, సుస్మిత కుటుంబసభ్యులు వ్యవహరించారు.

## దివ్యాంగుల పట్ల చిత్తశుద్ది లేదనడం మంచిపద్దతి కాదు



**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త :** వైఎస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆవుల నాగేంద్ర దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు అనడం సరైన పద్దతి కాదని టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు, దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండల వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవుల నాగేంద్ర కొన్ని సూటి ప్రశ్నలు వేయడం జరిగిందన్నారు. వికలాంగుల కార్పోరేషన్ అనేది స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ట్రైసైకిల్స్, వీల్చైర్స్, సంకకర్రలు, హీరింగ్ ఎయిడ్స్ ఆర్టీసిలో పాసులు అన్ని ఎన్టిఆర్తో ప్రారంభం కావడం జరిగిందన్నారు. ఈ కార్పోరేషన్ ద్వారా ఎంతో మందికి ఉపాధి కలగలేదా అని ప్రశ్నించారు. స్త్రీ శిశుసంక్షేమశాఖ ద్వారా దివ్యాంగులు, వయోవృద్దులు, లబ్దిపొందే విషయం తెలియదా అన్నారు. దానిని కలపడం ఏమిటి అని ప్రశ్నించారు. దివ్యాంగుల పెన్షన్ ఎన్టిఆర్ 30రుపాయలతో మొదలు పెడితే సిఎం చంద్రబాబునాయుడు రూ.6వేల నుంచి 15వేల వరకు ఇచ్చేది తెలియాదా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్రెడ్డి రూ.70లు నుంచి 200ల వరకు మాత్రమే పెంచడం జరిగిందని, వైఎస్.జగన్మోహన్రెడ్డి దివ్యాంగులకు పెన్షన్ పెంచకపోగా దివ్యాంగుల లోన్లు, పెండ్లికానుక, బ్యాక్లాగ్ పోస్టులు వంటి వాటిని తొలగించారన్నారు. దివ్యాంగులకు ప్రీబస్ సవతి, ఎస్స్ అఫిషియా సభ్యులుగా స్థానిక సంస్థలల్లో గౌరవం కల్పించడం వినికిడి లోపం ఉన్న వారికి డిగ్రీ కళాశాల ఏర్పాటు అమరావతిలో దివ్యాంగుల భవనం లోన్లు పునరుద్దరిణ, క్రీడలలో సమాన అవకాశం 250 ఎకరాలు విశాఖ పట్టణంలో ఏర్పాటు, బహుళ అంతస్తుల్లో గ్రౌండ్ప్లోరు దివ్యాంగూడుకు కేటాయింపు అన్నింటిలో దివ్యాంగుడుకు అవకాశాలు కల్పిస్తుంటే కూటమి ప్రభుత్వం ఏమి చేయలేదని అనటం మంచిది కాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.

## ప్రైవేటు వ్యక్తులతో విద్యుత్ పనులు బాధ్యత ఎవరిది..?



**విడవలూరు,డిసెంబర్ 11 ప్రభాతవార్త:** ప్రభుత్వం విద్యుత్శాఖ అధికారులకు వేలసంఖ్యలో జీతాలు, పదోన్నతి కల్పిస్తూ ప్రజలకు విద్యుత్ సమస్య తలెత్తకుండా పరిష్కరిస్తూ విధులు నిర్వహించాలని సూచనలు ఉన్నాయి. విడవలూరు మండలంలో జీతాలు తీసుకునే విద్యుత్ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో విద్యుత్ పనులు చేయించడం అమాయక వ్యక్తుల ప్రాణాలతో చెలగాటమే అని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో విద్యుత్ సరఫరా వల్ల సచివాలయం సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన సంఘటన తెలిసిందే. సరఫరా ఎటువైపు నుంచి ఉంటుందో ప్రభుత్వ విద్యుత్ అధికారి సబ్స్టేషన్కు తెలియపరిస్తే నిలపడం, విడుదల చేయడం జరుగుతుంది. మరి ప్రైవేటు వ్యక్తులకు ఏమైనా ప్రమాదం జరిగినట్లయితే బాధ్యతెవరు వహిస్తారు అని ప్రజల్లో చర్చలు మొదలయ్యాయి.

## ఆర్టీసి స్వచ్ఛతకు కృషి చేస్తున్న సన్నపరెడ్డికి అభినందనలు



**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త :** స్వచ్ఛ ఆర్టీసి కోసం ఆర్టీసి రీజయన్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కావలి బిజెపి నాయకులు తెలిపారు. సన్నపురెడ్డి సురేష్రెడ్డిని గురు వారం కావలి బిజెపి నాయకులు కలిసి పూల మాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రీజియన్ పరిధిలోని ఆర్టీసి డిపోలన్నింటికి శుభ్రతకు ఉపయోగపడే పరికరాలను అందించిన సందర్భంగా ఆయనకు సామాజిక ఉద్యమంలో మేము కూడా అండగా ఉండి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఎక్కడాలేని విదంగా డిపోలలో ఆయన స్వచ్ఛమైన వాతావరణాన్ని ఆశిస్తూ గత ఏడాదికాలంగా చేస్తున్న కృషి తారాస్థాయికి చేరుతూ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆధ్వర్యంలో అన్ని డిపోల వారికి పరికరాలను అందించడం అభినందనీయమని తెలిపారు. ఈకార్యక్రమంలో జిలాల టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, సీనియర్ జర్నలిస్టు జయప్రతాప్రెడ్డి, ఒకటవ పట్టణ అధ్యక్షులు మందకిరణ్కుమార్, యువమోర్చా నేతలు పల్లపోతుల సాయిక్రిష్ణ,దేవాండ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## 13 న విద్యుత్ సబ్ స్టేషన్లో మరమ్మత్తులు

**బిట్రగుంట డిసెంబర్ 11 ప్రభాతవార్త :** బోగోలు సబ్ స్టేషన్ నందు ఉన్న 5 ఎంవిఏ పవర్ ట్రాన్సార్మర్ స్థానంలో సామర్థం పెంచి 8ఎంవిఏ పవర్ ట్రాన్సార్మర్ ఈ నెల 13 వ తేది ఏర్పాటు చేయనున్నట్లు ట్రాన్సకో ఏఈ జడరాయ తెలిపారు.. కావున బోగోలు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అగ్రికల్చర్ వినియో గదారులు కు గృహ వినియోగదారులు కు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## స్క్రబ్ టైపస్పై అపోహలు వద్దు- వైద్యురాలు అఖిల



**దగదర్తి, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలో ఈ మధ్య కురిసిన వర్షాలకు జలుబులు, దగ్గులు, జ్వరాలు కొంత మందికి ఉండడంతో స్క్రబ్ టైఫస్ అనుకొని కొంత మంది భయబ్రాంతులకు గురవుతున్నారని, అది అపోహ మాత్రమేనని ప్రాథమిక వైద్యకేంద్రం డాక్టర్ అఖిల అన్నారు. గురువారం ఆమె ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. స్క్రబ్ టైఫస్ ప్రస్తుతానికి దగదర్తి మండల ప్రాంతంలో ఎవరికి లేదని, ఈ పురుగు నల్లగా నల్లి వలే ఉంటుందని, అవి ఎక్కువగా పొలాల్లో ఉంటాయని, పొలాల్లో పని చేసే వాళ్ళు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వర్షం కురవడం వల్ల సాధారణ జలుబు, దగ్గు, జ్వరాలు కొంత మందికి ఉన్నాయని అవి సాధారణ సీజనల్ జ్వరాలేనని భయపడాల్సిన అవసరం లేదని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్నారని చెప్పారు.

## విద్యుత్ భవన్లో సమీక్షా సమావేశం





**నెల్లూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త -వైద్యం :** జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్ర నెల్లూరు రూరల్ డివిజన్ అధికారులతో విద్యుత్ భవన్లోని స్కాడా కార్యాలయం నందు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ను అందించడమే మన ప్రథమ కర్తవ్యం, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు ఉద్యోగ బాధ్యతలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని రైతులకు, వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉందని, కావున అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని తెలియజేశారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఇది చాలా బాధాకరం అని తెలిపారు. ప్రభుత్వం వారు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశాలు కూడా ఇచ్చారని తెలిపారు. ట్రాన్స్ఫార్మర్ మెయింటనెన్స్ ఖచ్చితంగా చేయాలని అలా చేయక ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోతే మరమ్మత్తులకు అయ్యే ఖర్చు సంస్థపై పెనుభారం పడుతుందని ఇది సంస్థ మనుగడకే కష్టం అని తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పని చేయాలని, వినియోగదారుడికి సంతృప్తి కర సేవలు అందిస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందని తెలిపారు. విద్యుత్ అంతరాయల వల్ల సంస్థకు చెడ్డపేరు వస్తుందని అది మంచిది కాదని అంతరాయాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి సెక్షన్ ఆఫీసర్పై ఉంటుందని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పాటించని పక్షంలో సంబంధిత అధికారులు, సిబ్బంది వినియోగదారునికి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. డీసీ లిస్ట్ పక్కాగా చేయాలని లేనిచో చర్యలు తప్పవని తెలిపారు. డీసీ లిస్ట్ గడువు లోగా పూర్తి చేసి రెవెన్యూ కార్యాలయాలకు పంపాలని తెలియజేశారు. అధికారులు చాలా మంది వర్క్ ఆర్డర్లు కోజ్ చేయకుండా ఉన్నారని వారు వెంటనే క్లోజ్ చేయాలని లేనిచో ఆ అధికారి పర్సనల్ అకౌంట్లో పెట్టమని ఆదేశించారు. సంస్థకు రావాల్సిన రెవెన్యూ బకాయిలను వెంటనే రాబట్టాలని సంస్థ ఆర్థిక పురోగతి బాగుంటేనే సంస్థ బాగుంటుందని బకాయిలు రాబట్టడం సంస్థ ఉద్యోగులందరికి ప్రథమ బాధ్యత అని తెలిపారు. అధికారులు పనితీరు మార్చుకుని వినియోగదారులకు సంతృప్తి కర సేవలు అందించి ప్రభుత్వంకు, విద్యుత్ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి సెక్షన్ ఆఫీస్, ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలలో విద్యుత్ సిబ్బంది నిర్ధేశించిన సమయానికి ఆఫీసుకు ఖచ్చితంగా వెళ్లాలని అట్లా రానివారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేను సర్ప్రైజ్గా విజిట్ చేస్తానని తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులు తాము వాడుకుంటున్న అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఇస్తున్న 50శాతం రాయితీ ఇస్తుందని కావున వినియోగదారులు ఈ స్కీంను వినియోగించుకోవాలని కోరారు. ఈ స్కీం డిసెంబర్ 31 వరకు మాత్రమే అని తెలిపారు. ఒక కిలో వాట్కు డెవలప్మెంట్ ఛార్జీలు 2000 రూపాయలు కట్టవలెను. కానీ ఈ స్కీం కింద రూ.1000లు కడితే సరిపోతుంది. సబ్ స్టేషన్స్ను తరచుగా అధికారులు తనిఖీ చేస్తూ ఉండాలని, రికార్డ్స్ పరిశీలించాలని తెలిపారు. ఎక్కడైనా లో ఓల్టేజీ సమస్య ఉంటే వెంటనే గుర్తించి అదనపు ట్రాన్స్ఫార్మర్స్కు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అడిషనల్ లోడ్లను గుర్తించాలని అలాగే ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతుంటే తెలుసుకుని వారిపై చ్యలు తీసుకోవాలని తెలిపారు. 33 కేవీ లైన్స్, 11 కేవీ లైన్స్లను నిరంతరం పెట్రోలింగ్ చేయాలని తెలిపారు. చెట్ల కొమ్మలు మన లైన్స్కు తగులుతూ ఉంటే గుర్తించి చెట్ల కొమ్మలను తొలగించాలని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా ఇవ్వడం మన కర్తవ్యం, లక్ష్యం అని తెలిపారు. స్ట్రీట్ లైట్స్ పగలు కూడా వెలుగుతున్నాయి. స్తంభాలపై క్లీపర్స్ అల్లుకుపోతున్నాయి. ఇవన్నీ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. పద్దతిగా పీఎంఐ చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ హెడ్ క్వార్టర్స్లో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అంతరాయం ఏర్పడిన తర్వాతే చర్యలు తీసుకుంటున్నారని, కానీ అంతరాయం జరగకముందే అవసరమైన పనులు పూర్తి చేయడం లేదని అన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రూరల్(ఇన్చార్జి) లక్ష్మీ నారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ ప్రభాకర్, రాము, సుబ్రహ్మణ్యం, సురేష్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ సుబ్బారావు, ఏడుకొండలు, అసిస్టెంట్ ఇంజనీర్స్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవహక్కుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకోవాలి



**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త :** మానవహక్కుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకొని రక్షణ పొందా లని కావలి లోక్అదాలత్ సభ్యులు మాలకొండరెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణంలో విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో మానవహక్కుల రక్షణ చట్టాలపై అవగాహన సదస్సును గురువారం నిర్వ హించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాల కొండరెడ్డి పాల్గొని మాట్లాడారు. మనదేశంలో మానవహక్కుల రక్షణ చట్టం 1993 పార్లమెటులో తీసుకురా వడం జరిగిందని తెలిపారు. ఈ చట్టంచే ఎప్పుడైనా పౌరులకు మానవహక్కుల ఉల్లంఘన జరిగినపుడు రక్షణ కొరకు ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. కేంద్ర స్థాయిలో జాతీయ మానవహక్కుల కమీషన్, రాష్ట్రాస్థాయిలో రాష్ట్ర మావనహక్కుల కమీషన్ ఏరాపటు చేయడం జరిగిందన్నారు. హక్కులకు ఉల్లంగన జరిగినప్పుడు కోర్టులో గాని మానవ హక్కుల కమీషన్ ద్వారా రక్షణ పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం మాధవి, కరస్పాండెంట్ జ్యోతి,శ్రీజవహర్బారతి కళాశాల విశ్రాంత అధ్యాపకులు క్రిష్ణప్రసాద్ పాల్గొని విద్యార్థులకు ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగించడం జరిగింది. అనంతరం జరిగిన మానవ హక్కులపై వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవజీవన్ ఆర్గనైజేషన్ సేవలు నిరుపమానం




**కోవూరు డిసెంబర్ 11 ప్రభాతవార్త :** చెత్త ఏరుకుని జీవనం సాగించే 1400 కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టిన నవజీవన్ ఆర్గనైజేషన్ సేవలు ఇతలకు స్ఫూర్తిదాయకమని ఎంపీడీవో శ్రీహరి రెడ్డిఅన్నారు కోవూరు మండలం పడుగుపాడు గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం మొంత తుఫాన్ రిలీఫ్ లో భాగంగా నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చెత్త ఏరుకుని జీవనం సాగించే 1400 కుటుంబాల వారికి లక్షలు విలువచేసే నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ ఆర్గనైజేషన్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు చెత్త ఏరుకుని జీవనం సాగించే కుటుంబాలు పూర్తిస్థాయిలో ప్రభుత్వ పథకాలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు అదేవిధంగా తమ బిడ్డలను ఈ వృత్తిలోకి రానీయకుండా వారిని ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని పిలుపునిచ్చారు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఆర్గనైజేషన్ చదువు ఆరోగ్యం జీవనో పాదుల పెంపుదలకు కృషి చేయడం అభినందనీయమన్నారు ఇటువంటి వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీం నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ విక్టోరియా ఎగ్జిట్ డైరెక్టర్ కె లావణ్య నవజీవన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె పెంచలయ్య తుపా కుల శ్రీనివాసులు నవజీవన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విఎస్ విజయభాస్కర్ పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ సిహెచ్ రవి, నవజీవన్ సిబ్బంది ఉన్నారు

## లక్షల విలువచేసే నిత్యవసర సరుకులు పంపిణీ.



**కోవూరు డిసెంబర్ 11 ప్రభాతవార్త :** చెత్త ఏరుకుని జీవనం సాగించే కుటుంబాలను ప్రత్యేకంగా గుర్తించి వారికి కూడా కనీసం పక్షం రోజుల పాటు నాణ్యమైన నిత్యావసర సరుకు లు పంపిణీ చేయాలని నవజీవన్ ఆర్గనై జేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు 1400 కుటుంబాల వారికి గురువారం స్థానిక పడుగుపాడు పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఆర్గనైజేషన్ ఉద్యోగ సిబ్బంది ఆధ్వర్యంలో పంపిణీ చేసి వారి హృదయాల్లో గట్టిగా చోటు సంపాదించుకున్నారు ఇంత భారీ స్థాయిలో నాణ్యమైన బియ్యం నూనె ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేలా సంస్థ చర్యలు తీసుకోవడం పట్ల నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టోరియా ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ కె లావణ్య నవజీవన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విఎస్ విజయభాస్కర్లను ఎంపీడీవో శ్రీహరి రెడ్డి డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు

## పెన్షనర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త :** కావలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ నూతన కమిటీ ఎన్నికలు ఈనెల 27న శనివారం ఉదయం 9గంటలకు స్థానిక ఫైర్సేటషన్ రోడ్డులోని పెన్షనర్ల భవన్లో నిర్వహించడం జరుగుతుందని ఆసంఘం అధ్యక్షులు ఆకుల రమణయ్య గురువారం తెలిపారు. పెన్షనర్లం దరూ తప్పక హాజరై నూతన కమిటీ ఏర్పాటుకు తొడ్పడవలసిందిగా కోరడమైనది.

## సిఎస్డిటిచే రేషను షాప్ తనిఖీ



**బిట్రగుంట డిసెంబర్ 11 ప్రభాతవార్త :** బోగోలు మండలంలోని జువ్వలదిన్నె గ్రామంలో రేషన్ షాప్ ను గురువారం కావలి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ఎం. విజయమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రేషన్ పంపిణి తీరును పరిశీలించారు. విని యోగ దారులను వారికి సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. షాప్ నిర్వహ ణలో సమయపాలన పాటించాలని సూచించారు.

## 13న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**కోవూరు, డిసెంబరు11 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో 13న శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు.ఈ మేరకు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, పంచాయతీ కార్యద ర్శులు మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు తప్ప నిసరిగా హాజరు కావాలన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం మరింత రుచిగా

### - చార్జీలు పెంచిన ప్రభుత్వం

### పెరిగిన ధరలు ఫిబ్రవరి, ఆగస్టు నుంచి అమలు





**కోవూరు, డిసెంబరు11 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం పెట్టిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల కాలంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించింది. ముఖ్యంగా ఈ భోజన పథకంలో వడ్డించే నాణ్యతగా లేవని ఆశించిన మేర విద్యార్థులు తినేందుకు ఇష్టపడేవారు కాదు. ఈ నేపథ్యంలో పాలన ప్రారంభించిన ఏడాదిలోపే మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సన్నబియ్యం అందించింది. ఇటువంటి పరిస్థితుల్లో పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని వంట చార్జీలను కూడా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మధ్యాహ్న భోజన పథకం మరింత రుచిగా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ నుంచి అన్ని మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. గతంతో పోల్చుకుంటే సన్నబియ్యం వచ్చిన తర్వాత భోజనం చేసే పరిస్థితి నానాటికి పెరిగే పరిస్థితి ఏర్పడింది.

**- పెరిగిన ధరలు ఫిబ్రవరి, ఆగస్టు నుంచి అమలు**

కోవూరు మండలానికి సంబంధించి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పెంచిన ధరలు ప్రాథమిక స్థాయి వరకు ఫిబ్రవరి నెల నుంచి ఉన్నత పాఠశాలలకు ఆగస్టు నెల నుంచి అమలు చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మ తెలిపారు. గతంలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థికి రోజుకు రూ.5.45 లు చెల్లిస్తుండగా.. ప్రస్తుతం దానిని రూ.6.19 లకు పెంచడం జరిగిందన్నారు. అదేవిధంగా 6 నుంచి 8 తరగతుల వరకు గతంలో 8.17 పైసలు ఉండగా ప్రస్తుతం దానిని 9.89లకు పెంచడం జరిగిందన్నారు. మండలంలో 61 పాఠశాలల్లో 4752 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు కూడా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ప్రభుత్వం ఏజెన్సీలకు వంట చార్జీలు పెంచుతూ ఉత్తర్వులు కూడా ఇటీవల జారీ చేయడం జరిగిందన్నారు.

## సబ్సిడీ ఫైబర్ బోట్లను మత్స్యకారులు వినియోగంచుకోండి

### - మెరైన్ ఎస్ఐ అంజి రెడ్డి




**ముత్తుకూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** ప్రభుత్వం సబ్సిడీ కింద ఫైబర్ బోట్లను అందిస్తుందని వాటిని మత్స్యకారులు వినియోగంచుకోవాలని మెరైన్ ఎస్ఐ అంజి రెడ్డి పేర్కొన్నారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయతీ ఆర్కాట్ పాలెం గ్రామంలో పోస్ట్ గార్డ్ మెరైన్ పోలీసుల సం యుక్త ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగా హన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోస్ట్ గార్డ్ డిప్యూటీ కమాండెంట్ సిహెచ్ లోకేష్ విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటకు వెళ్లే మత్స్యకారులకు కోస్టా గార్డ్ అధికారులు పలు సూచనలు చేశారు. ముందుగా మత్స్యకారులు ఇతర రాష్ట్రాల నుంచి కరైకల్ బోట్లతో చేపల వేటకు వచ్చే వారి వలన తమకున్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకుని వచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం సబ్సిడీతో అందించే ఫైబర్ బోట్లను మత్యకారులు ఉపయోగించి వేటకు వెళ్లాలని సూచించారు. మత్స్యకారులకు వేటకు వెళ్లేటప్పుడు లైఫ్ జాకెట్, ఆధార్ కార్డులు, లైసెన్సు వంటి గుర్తింపు కార్డులను తమ వెంట పెట్టుకోవాలని తెలిపారు. బోట్లలో తగిన వాటర్ కెరీ చేయాలన్నారు. రాత్రి వేట సమయంలో ప్రమాదాలు జరగవచ్చునని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సముద్రంలో వేటలో క్యాట్ ఫిష్ పట్టుకునేటప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలని అది కరిస్తే పాయిజన్ సోకుతుందన్నారు. అనంతరం మెరైన్ ఎస్ఐ అంజి రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను తెలుసుకునేందుకు కమ్యూనిటీ ఇంట్రాక్షన్ చేపట్టినట్లు వెల్లడించారు. సముద్రంలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే సిపిఆర్ ఎలా చేయ్యాలి అని నేర్చుకోవాలని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో కోస్ట్ గార్డ్ ప్రధాన్ యాంత్రిక్ జగదీష్, ప్రధాన్ నావిక్ సత్యనారాయణ, మత్స్యకార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాదా బైనామాల భూక్రమబద్ధీకరణకు డిసెంబర్ 31 వరకు గడువు

### - రైతులు తప్పక వినియోగించుకోవాలని తాసిల్దార్ విజ్ఞప్తి



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని 22 పంచాయతీలలో సాదా బైనమాలు (అగ్రిమెంట్ ఆఫ్ సేల్) ఆధారంగా భూములు కొనుగోలు చేసిన రైతులందరికీ పెద్ద ఉపశమనం కలిగించే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గడువును మరొకసారి పొడిగించినట్లు తాసిల్దార్ వి. సుదీర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం 2024 జూన్ 15 ముందు సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూములను క్రమబద్ధీకరించుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు ప్రత్యేక గడువు ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులు తమకు సంబంధించిన గ్రామ సచివాలయం లేదా మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న తేదీ నుండి గరిష్టంగా 90 రోజులలోపే వాటి పరిశీలన పూర్తవుతుందని తాసిల్దార్ చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వేగవంతంగా సేవలు అందించేందుకు అధికారులను ఆదేశించినట్లు కూడా తెలిపారు. సన్నా, చిన్న మరియు మధ్య తరహా రైతులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు చేయబడటం వల్ల ఇది రైతులకు పెద్ద ప్రయోజనం అవుతుందని తాసిల్దార్ వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని, పత్రాలు సక్రమంగా సిద్ధం చేసుకొని వెంటనే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. టిపిగూడూరు తాసిల్దార్ వి. సుదీర్ మాట్లాడుతూ,"సాదా బైనామాల వల్ల ఇబ్బందులు పడుతున్న రైతుల కోసం ప్రభుత్వం ఎంతో సహాయకమైన నిర్ణయం తీసుకుంది. రైతులందరూ ఈ అవకాశంను పూర్తిగా వినియోగించుకొని తమ భూములను చట్టబద్ధం చేసుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు

# రాజకీయ వైషమ్యాలతో వాటర్ ప్లాంట్ మూత

- గత 18 నెలలుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- వర్గ విభేదాలతో వాటర్ ప్లాంట్ నిరుపయోగం
- చోద్యం చూస్తున్న అధికారులు

జిల్లా కలెక్టర్ గారూ.. మీరైనా పట్టించుకోండి




**కోవూరు, డిసెంబరు11 ప్రభాతవార్త** గత ప్రభుత్వంలో ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలనే ఉద్దేశంతో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి నిధుల నుంచి రూ. 5 లక్షలు ఖర్చు పెట్టి గిరిజన కాలనీ ప్రాంతంలో అప్పటి ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్లాంట్ ప్రారంభించినప్పటి నుంచి ఈ ప్రాంత వాసులకు సురక్షిత మంచినీరు అందుతూనే ఉంది. ఇటీవల ఎన్నికల్లో ప్రభుత్వాలు మారడంతో ఈ ప్లాంట్‌కు రాజకీయ రంగు పడింది. ఇప్పటివరకు ఈ ప్లాంట్‌ను ఒక వైసీపీ నేత పర్యవేక్షిస్తూ ఉన్నారు. ప్రభుత్వాలు మారడంతో రాజకీయ వైషమ్యాల కారణంగా ప్రస్తుత టీడీపీ నేతలు ఆ ప్లాంట్‌ను అర్థాంతరంగా మూసి వేసేలా చర్యలు చేపట్టారు. గత 18 నెలలుగా ఈ ప్రాంత వాసులు బయట ప్రాంతాల నుంచి 10 నుంచి 20 రూపాయలకు కొనుగోలు చేసి వాటర్ క్యాన్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. కోవూరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోవూరు పంచాయతీ పరిధిలోని చెర్లో గాంధీ సంఘం గిరిజన కాలనీ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈ ప్రాంత వాసులు గత సంవత్సర కాలం పైగా ఈ వాటర్ ప్లాంట్ నీటికి అలవాటు పడిపోయారు. అయితే గత 18 నెలలకు పైగా ఈ వాటర్ ప్లాంట్ మూత పడడంతో ఈ ప్రాంత వాసులు సురక్షిత మంచినీటి కోసం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీసం సంబంధిత అధికారులు కూడా ఈ విషయంలో ఎటువంటి స్పందన చూపకపోవడం ఈ ప్రాంత వాసులను కలిచివేసింది. దీంతో ఇటీవల జరిగిన గ్రామ సభకు వచ్చిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి పలువురు పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తీసుకొచ్చారు. కేవలం వైసీపీకి చెందిన వ్యక్తి ఈ ప్లాంట్‌ను నడుపుతున్నాడనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఆపడం ఎంతవరకు సబబని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఎన్నికల వరకే రాజకీయాలు అని ఎన్నికల తర్వాత ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. వెంటనే ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అయినా కూడా ఇంతవరకు ఈ వాటర్ ప్లాంట్ ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు సురక్షిత నీరు అందించే ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

# కట్టిన అట్రాసిటీ కేసుల్లో ఎక్కడ నష్టపరిహారం చెల్లించడం లేదు

- జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఉల్లిపాయల మురళి కృష్ణ యాదవ్



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంనందు 3వ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, డీవీఎంసీ చైర్మన్ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల, జిల్లా ఎస్పీ శ్రీమతి అజితవేజెండ్ల, జెసి మొగిలి వెంకటేశ్వర్లు మరియు జిల్లా అధికారులు ఆర్డీఓలు, డిఎస్పీలు, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి తదితరాలు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మాన్ని ఉద్దేశించి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఉల్లిపాయల మురళి కృష్ణయాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కట్టిన అట్రాసిటీ కేసుల్లో ఎక్కడ కూడా ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు మానిటరింగ్ నష్టపరిహారం చెల్లించడం లేదని దాని వలన బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దానిని వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేకూరాలని తెలిపారు. జిల్లాలో చాలా వరకు ఫాల్స్ కేసులు కడుతున్నారు అని వాటికి సరైన ఆధారాలు ఉండటం లేదు అని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన తరువాత పోలీస్ అధికారులు కేసులు కట్టాలని తెలిపారు. జాతీయ యస్సీ కమిషన్ మరియు రాష్ట్ర యస్సీ కమిషన్ నుంచి వచ్చిన పిర్యాదులు జిల్లా అధికారులకు బదలాయిస్తే వాటిని వెంటనే పరిష్కరించాలని ఎక్కువ టైం తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో గత 3 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ బ్లాక్ లాక్ పోస్టులు కలగానే మిగిలిపోయారు అని వాటిని వెంటనే భర్తీ చెయ్యాలి అని తెలిపారు. వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మోటిక్ చార్జులు నెలల తరబడి పెండింగ్లో వున్నాయి అని వాటిని వెంటనే పరిష్కరించకానీ కోరారు.స్థానిక నెల్లూరు నగరం అంబేద్కర్ విగ్రహం ఆవరణలో కొన్ని షాపింగ్ మాల్స్ వారు అలాగే వాణిజ్య సంస్థల వారు అనుమతులు లేకుండా పబ్లిసిటీ బోర్డ్స్ పెడుతున్నారు అని అలాగే కొంత మంది మద్యం సేవించి మద్యం బాటిల్స్ కూడా అక్కడ వేస్తున్నారు. అని వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్సీలకు ప్రభుత్వం ఇచ్చిన భూములు అన్యాక్రాంతం అయ్యాయి అని అలాగే కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు వాటిని ఆక్రమించి ఉన్నారు అని వాటిపై ఒక కమిటీ వేసి నిరుపేద ఎస్సీ,ఎస్టీ లకు న్యాయం చేయాలి అని తెలిపారు.జిల్లాలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు, అంతర్గత రహదారులు అనుమతులు మంజూరు చేసి నిర్మించాలి, అలాగే సామాజిక భవనాలు చాలా వరకు శిథిలాల వ్యవస్థకి వచ్చినాయి వాటికి మరమత్తులు చేసి ఇవ్వాలని కోరారు. ఎస్సీ సంక్షేమ హాస్టల్స్‌లో పనిచేసే వంట మనిషిని, కమటి, కాపలాదారుడు వారి డిజినాస్షన్ పేరు మార్చాలని వారు చాలా చోట్ల వారికి కింది స్థాయి ఉద్యోగులని వారిని చిన్నచూపు చూస్తున్నారు అలాగే ఇళ్ళు అద్దెకు కూడా ఇవ్వడం లేదు. వంట మనిషిని (ఫుడ్ మేనేజర్గా), కమాటిని (కేర్ టాకర్గా) కాపలాదారుని (ప్రొటక్షనర్గా) డిజిగ్నేషన్ మార్చి వారిని గౌరవించాలని కోరారు. జిల్లాలో దశాబ్దాల కాలంనాటి కల అంబేద్కర్ భవన్ దానిని ఇంతవరకు పూర్తి చేయలేదు. వెంటనే పూర్తి చెయ్యాలి అని విజ్ఞప్తి చేశారు. అలాగే మరో డీవీఎంసీ మెంబెర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ పోలీసు కేసుల్లో చాలా వరకు తప్పు తడికలు వున్నాయి అని, అందులో కావాలి, కందుకూరు, విడవలూరు ఇలా చాలా కేసులు పెండింగ్‌లోనే ఉన్నాయని అవే ఉదాహరణ అని 7 నుంచి 5 సంవత్సరాలు కేసులు అయినా పూర్తి స్థాయి విచారణ జరగపోవడం దారుణమని తెలిపారు. మరో డీవీఎంసీ మెంబెర్ గంధం శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల సమన్వయం కొరవడిందని వాటిని సరిచేసుకోవాలని కోరారు. మరో డీవీఎంసీ మెంబెర్ దుంప ఏసోబు మాట్లాడుతూ ఎస్సీలకు సంబంధించిన ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మీ ఇల్లు రోడ్ వైండింగ్‌కి పోతుంది అని తోటపల్లి గూడూరులో ఇల్లు కూల్చారు అని తెలిపారు. వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేద ఎస్సీ ఎస్టీలకు రేపు ప్రభుత్వం చేపట్టే భూ పంపిణీలో భూమి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

# సమాజాభివృద్ధిలో దాతలు భాగస్వామ్యం కావడం అభినందనీయం :

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 11 ప్రభాతవార్త** గురువారం నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల,పల్నాడు జిల్లాల్లోని 27 బస్‌స్టేషన్లకు సంబంధించి ఎఎంఆర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పివిఆర్ ఇంజనీర్స్, కాంట్రాక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల సహకారంతో సమ కూర్చిన మెగా స్వచ్ఛ ఆర్టీసీ పరికరాల పంపిణీ మేళా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల రోజువారీ ప్రయాణంలో ఆర్టీసీది కీలకపాత్ర అన్నారు. 80శాతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ సేవలు వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలకు, ఆర్టీసీకి మధ్య ఉన్న అనుబంధం విడదీయలేనిదన్నారు. అటువంటి గొప్ప సంస్థ ఆర్టీసీలో పనిచేస్తున్న పారి శుధ్య కార్మికులకు, హమాలీలకు అవసరమైన డస్ట్‌బిన్లు, బకెట్లు, స్వెట్టర్లు, ఆప్రాన్లు, రెయిన్‌కోట్లు, క్లీనింగ్ లిక్విడ్స్ మొద్కలెన పరికరాలను తమ సొంత నిధులు రూ.22 లక్షలు వెచ్చించి సమకూర్చిన దాతలు ఆల్తూరి మహేష్‌రెడ్డి, పి.వి.రమణయ్య నాయుడును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ సహకా రంతో పాటు దాతలు కూడా తమ వంతుగా సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావడం పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ సేవలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి సేవలను మరింత నాణ్యంగా అందించేందుకు దృష్టి సారించినట్లు చెప్పారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్న పరెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఆర్టీసీ ఒక వ్యాపార సంస్థ కాదని, ప్రజలకు సేవ చేసే సంస్థ అని చెప్పారు. ఆర్టీసీలో చిన్నస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు అందరూ సమష్టిగా ఒకే కటుంబంలా ఆర్టీసీ అభివృద్ధికి పనిచేస్తున్నట్లు చెప్పారు. గొప్ప మనసుతో ఆర్టీసీకి ఎందరో దాతలు తోడ్పాటు అందిస్తున్నారని, వారి సేవాభావాన్ని కొనియాడారు. స్వచ్ఛ ఆర్టీసీ సాధనలో భాగంగా కార్మికులకు రూ.22 లక్షలు విలువజేసే పరికరాలను అందించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లు, కండ క్టర్లకు కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు. కార్మికులకుపరికరాలను, స్వెట్టర్లను పంపిణీ చేశారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్ర సాద్, ఎఎం ఆర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ప్రాజెక్టు అధికారి నాగేశ్వరరావు, పివిఆర్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహ కులు పోతు గుంట వెంకట రమణయ్య నాయు డు, ఆర్టీసీ సిటిఎం రమేష్‌బాబు, సిఇ సునీత, సివిల్ ఎఇ సుభాషణ రావు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 15 న శుభస్వీకరణ భవనానికి శంకుస్థాపన



**బుచ్చి డిసెంబర్ 11 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కైలాస భూమి పక్కన శుభస్వీకరణ భవనానికి 15న శంకుస్థాపన చేయనున్నట్లు కైలాసభూమి కమిటీ అధ్యక్షులు టంగు టూరు మల్లి కార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.వి శేషయ్య ,కోశాధికారి తిరివీధి రాధాకృష్ణయ్య, కమిటి సభ్యులు తెలిపారు.శుభస్వీకరణ భవనం నిర్మాణం చేయు స్థలంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతు గతంలో కర్మక్రతువులు చేసు వసతులతో నిర్మాణం చేయాలంటే బుచ్చిపట్టణంలోని దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తే బాగుంటుందని వారు పిలుపునిచ్చారు ..భావితరాలకు మంచి చేసిన వాళ్ళం అవుతామని అన్నారు.కైలాస భూమి నిర్మాణం ఎంతో అద్భుతంగా చేశామని ఆ సమయంలో అనేక మంది దాతలు సహకరించారని వారు తెలిపారు. అలాగే శుభస్వీకరణ భవన నిర్మాణంలో కూడా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కైలాసభూమి కమీటి సభ్యులు ఇన్నమూరి కృష్ణయ్య, బాలు సుబ్బారావు, కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి, రామిశెట్టి,కళ్యాణ్, కాసా శ్రీనివాసులు,దర్శిబాలు, చేపూరు చలమయ్య ,యానాదిరెడ్డి,చోళం వెంకయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, మరికొంతమంది పెద్దలు పాల్గొన్నారు.

కునేందుకు చిన్న భవనం ఉన్నిందని వారు తెలిపారు. రోజు రోజుకి జనాభా పెరిగి పోవడం ఒకే రోజు ఇద్దరు ముగ్గురు కర్మ క్రతువులు చేసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉన్నిందని వారు తెలిపారు.ఈ స్థలంలో నూతనంగా శుభస్వీకరణ భవనం నిర్మాణం చేస్తే ప్రజలకు బాగుటుందని ఈవిషయాన్ని కైలాస భూమి కమిటి వారు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళగా స్పందించిన ఆయన 24 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా వారు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 15 వతేది ఉదయం 9.30 నిమిషాలకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని చెప్పారు. ఈశుభస్వీకరణ భవనం ఏర్పాటు చేస్తే బుచ్చిపట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మృతదేహాన్ని భద్రపరిచేందుకు గది,ఫ్రీజర్, అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు వివరించారు. ఈ భవనం మరింత




# తిరుపతి జిల్లా వద్దు నెల్లూరు జిల్లా ముద్దు



**పొదలకూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త** పొదలకూరు గేట్ సెంటరలో డిప్యూటీ ఎగ్జిక్యూటీ ఇంజనీర్ కార్యాలయం వద్ద బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో రాపూరు, సైదాపురం, కలువాయి, మండలాలను నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి ధర్నా నిర్వహించి అనంతరం జూనియర్ అసిస్టెంట్ షేక్ షన్వాజ్, వినతిపత్రం అందజేశారు. తిరుపతి జిల్లా వద్దు నెల్లూరు జిల్లా ముద్దు అంటూ నినా దాలు చేశారు. అనంతరం బిజెపి సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాపూరు మండలం ను తిరుపతి జిల్లాలో కలపడం వల్ల కండలేరు జలాశయం కింద వున్న పొదలకూరు మండలం కలువాయి, సైదాపురం, రైతులు, ప్రజలు, అనేక ఇబ్బందులు పడుతారన్నారు. ఎన్నికలు ముందు కూటమి ప్రభుత్వం రాపూరు, సైదాపురం, కలువాయి, మండలాలను నెల్లూరు జిల్లాలోనే ఉంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపే ఆలోచన వెనక్కి తీసుకొనే విధంగా సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సబ్ కమిటీకి నివేదిక పంపాలని డిమాండ్ చేశారు. బిజెపి పొదలకూరు మండల అధ్యక్షులు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షులు రాచపూడి ధనుంజయ, చొప్ప వెంకటేశ్వర్లు, పొదలకూరు టౌన్ అధ్యక్షుడు ఓబులేష్, ఎస్సీ, ఎస్టీ మండల అధ్యక్షుడు గురుస్వామి, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు పిచ్చయ్య, వాకా శ్రీను, రంగారావు, రామ్మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మగ్గం వర్క్‌తో మహిళలకు చేయూత




**చేజర్ల డిసెంబర్ 11 ప్రభాతవార్త** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మగ్గం వర్క్,ప్యాబ్రిక్ పెయింటింగ్ వర్క్ ఎంతగానో దోహదపడుతాయని డిఆర్‌డిఏ ప్రాజక్టు డైరక్టర్ నాగరాజకుమారి పేర్కొ న్నారు. గురువారం ఆమె చేజర్ల వెలుగు కార్యాలయంలో ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఆర్ఎస్ ఇటిఐ గ్రామీణ స్వయం ఉపాధీ శిక్షణ సంస్థ వెంకటాచలం నెల్లూరు వారి ఆద్వర్యంలో ఈశిక్షణ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ఆధారిత కుటుంబాలు ఎక్కువగా ఉంటాయని,కుటుంబపోషణకు మహిళలు కూడా తోడ్పాటు అందిచేందుకు ఈ పని ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పెళ్ళిళ్ళు,ఫంక్షన్లకు మహిళలు ఎక్కువగా మగ్గం వర్క్‌వైపు మొగ్గు చూపుతున్నారని ఈ పని వారి ఆర్థికాభివృద్ధికి మంచి తోడ్పాటు నివ్వగలదన్న ఆలోచనతో ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు ఆమె చెప్పారు. 35 మంది మహిళలకు ఈ పథకంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9 నుండి సాయింత్రం 5 గంటల వరకు ఒక ఇన్స్టక్టర్‌ను నియమించి ఈశిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మనిశేఖర్ ఆర్ఎస్ ఇటిఐ డైరెక్టర్ డిపిఎంఎల్ హెచ్ మధుసూదన్ ఏబిఎన్ నాగేంద్ర ప్రసాద్,స్టేట్ బ్యాంకు ఆప్ ఇండియా ఏపిజిబి మేనేజర్ ఏపిఎం సుజన, సిసిలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఈ రబీలో పుట్టెడు దు:ఖంలో రైతు

- వ్యవసాయం చేసి కోలుకోగలమా అనే మీమాంస
- నిరాశ నిస్పృహలతో ఉన్న రైతును ప్రభుత్వం ఆదుకోవాలి



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో రైతాంగం వరుస తుపానులతో తీవ్రంగా నష్టపో యింది. వరిరైతుకు దిత్వా తుఫాన్‌అపార నష్టాన్ని మిగిల్చింది. మరో 15 రోజుల్లో చేతి కొస్తుందన్న నారు నీట మునిగింది. ముందస్తుగా వేసిన నాట్లు భారీ వర్షాలకు దెబ్బతిని రైతునిండా మునిగిపోయిన సందర్భం గా ఈ ఏడాది కొనసాగుతోంది. ఈ పరిస్థి తుల్లో నారుమడులు దెబ్బతిన్న రైతులు దిక్కుతోచని స్థితిలో విత్తనాలకు పరిగెడుతున్నారు. మరో వైపు ముందస్తుగా వేసిన నాట్లు పూర్తిగా దెబ్బతిని కన్నీటిని మిగిల్చా యి. ఈ స్థితిలో ప్రస్తుతం వేస్తున్నా ట్లకు ఈ పంట నమోదును తప్పనిసరిగా చేయాల్సి ఉంది. ఆ దిశగా వ్యవసాయశాఖ ప్రయత్నాలు సాగిం చాల్సిన ఆవశ్యకత ఉంది. రైతులు మరో మారు నష్టపోకుండా చూడా ల్సిన బాధ్యత వ్యవసాయ శాఖపై ఉందన్నది వాస్తవం. నాట్లు దెబ్బతిన్న రైతులకు రసాయన ఎరువులు, నాట్ల కూలీలు తడిసి మోపెడయ్యాయి. ఇలాంటి దుస్థితిలో రైతులకు ప్రభుత్వం దన్నుగా నిలిచి మరో మారు వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాట్లు దెబ్బతిన్న రైతులకు స్వల్ప సాయమైనా ప్రభుత్వం అందించి ఆదుకోవాలని జిల్లాలో రైతాంగం కోరుతున్నారు. ప్రస్తుత ఈ రబీ సీజన్లో వ్యవసాయశాఖ అందించిన సమాచారం కన్నా రెండింతలు రైతాంగం నష్టపోయినట్లు అంచనాలకు అందుతున్నాయి.

# 13న జెడ్పిలో సర్వసభ్య సమావేశలు



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త** 13న ఉదయం గం.10.30లకు నెల్లూరు జిల్లా ప్రజా పరి షత్ సాధారణ సర్వసభ్య సమావేశం నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు సమావేశ మంది రము నందు నిర్వహి స్తున్నట్లు జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా నీటి పారుదల శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, రహదారులు, భవనముల శాఖ, జిల్లా ప్రజా పరిషత్ 2026-27 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ అంచనాలు, 2025 - 26 ఆర్థిక సంవత్సరపు సవరణ బడ్జెట్ అంచనాలు, ఇతర అధికారిక వ్యవహారములుతో, సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్టు సిఈఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# ప్రారంభమైన బ్లెండర్స్‌ప్రైడ్ ఫ్యాషన్‌టూర్

**నెల్లూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త-విద్య :** ఫ్యాషన్ డిజైన్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో స్టైల్, పవర్, లుక్స్‌తో తాము రూపొందించి చేపట్టిన బ్లెండర్స్‌ప్రైడ్ ఫ్యాషన్ టూర్‌కు ప్రజల నుండి విశేష స్పందన లబిస్తుందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా సిఎంఓ దేశశ్రీదాస్ గుప్తా పేర్కొన్నారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఫ్యాషన్, సాంస్కృతిక సంభాషణలను తీర్ధి దిద్దటంలో తాముముందు వరుసలో ఉన్నామన్నారు. టూర్ యొక్క జైపూర్ ఎడిషన్ ఆకలను అత్యంత ఉత్సాహంగా మెటార్ క్రీడబా , అందమైన ఫ్యాషన్ లుక్ లను మిలితం చేసిందన్నారు. డిజైనర్స్ అభిషేక్,నమ్రత జోషిపుర లు మాట్లాడుతుడు సృజనాత్మకత యొక్క సరిహద్దులను అధిగమించటం ద్వారా బ్లెండర్స్‌ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఎల్లప్పుడూ విజేతగా నిలుస్తుందన్నారు. వేగంగా మారుతున్న ఫ్యాషన్‌ను అర్థంచేసుకుని తాము ఈ నూతన ఉత్పాదనలను రూపొందించటం జరిగిందన్నారు. అత్యంత ఉత్సాహవంతమైన కోటియర్‌ను విలక్షణమైన ,వ్యక్తిగత అభిరుచి రంగంలోకి తీసుకురావటానికి ఈ టూర్ తమకు ఎంతగానో ఉపకరించిందన్నారు.హర్నాజ్ సంధు మాట్లాడుతు జైపూర్‌లో టూర్ కోసం రన్‌వేని ఉపయోగించటం రేస్‌ట్రాక్‌పై కి అగుడుపెట్టిన అనుభవాన్ని ఇచ్చిందన్నారు.అందరూ తమను ఆదరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ర్యాపర్ రఫ్తర్, సునీల్ సేథీ, ఇసాన్ ఖట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేన పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం



**ఆత్మకూరు డిసెంబర్ 11 ప్రభాతవార్త** జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం ఆత్మకూరు నియోజకవర్గానికి సంబందించి నాయకులు ,కార్యకర్తలు పాల్గోని విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ లక్ష్మాలు ,ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. గ్రామాలస్థాయిలో పార్టీ బలోపేతం,ప్రజాసేవ,యువత భాగస్వామ్యం, భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, వంటి ముఖ్య అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు చదలవాడ హరీష్ మాట్లాడుతు ప్రజలకోసం నిజాయితీతో పోరాడే పార్టీ జనసేన మాత్రమే అని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను పార్టీ నాయకత్వానికి చేరవేయాలని అన్నారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని జనసేన బలమైన స్థావరంగా మార్చడానికి అందరు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ చర్చలో స్థానిక సమస్యలు,అభివృద్ధి అవసరాలు, వారి పరిష్కారాలపై కొన్ని కీలకనిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరికి పార్టీ నాయకత్వం ధన్యవాదాలు తెలిపింది.ఈకార్యక్రమంలో జనసేన పార్టీ సంఘం మండలం సీనియర్‌నా యకు లు,ఆత్మకూరు నియోజకవర్గ చిరంజీవి యువత అద్యక్షులు దాడి భనుకిరణ్,ఏఎస్‌పేట జనసేన పార్టీ మండలాద్యక్షులు సయ్యద్ అక్బర్‌బాషా, జనసేన పార్టీ ఆత్మకూరు టౌన్ సీనియర్‌నాయకులు గడ్డం వంశీకృష్ణ, ఆత్మకూరు రూరల్ జనసేన పార్టీ సీనియర్ నాయకులు పసుపులేటి శ్రీరామ్, తోడేటి వెంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా జనసేనపార్టీ జాయింట్ సెక్రటరీ వనం పవన్, నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

# జిల్లా మార్పుకు వ్యతిరేకంగా జోరుగా సంతకాల సేకరణ

..తిరుపతి జిల్లా వద్దు..నెల్లూరు ముద్దు అంటున ప్రజలు

**రాపూరు,డిసెంబరు11ప్రభాతవార్త** రాపూరు మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే వుంచాలంటూ రాపూరు జెఎసి ఆధ్వర్యంలో సంతకాల సేక రణ కార్యక్రమం ముమ్మరంగా చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో వున్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారి చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ నిర్వయానికి వ్యతిరేకంగా రాపూరులో యువకులు, వివిధ ప్రజా సంఘాల నేతలు స్వచ్ఛందంగా జిల్లా మా ర్పును వ్యతిరేకిస్తూ తిరుపతి వద్దు..నెల్లూరు ముద్దు అనే నినాదంతో జోరుగా మండలంలోని 21 పంచాయి తీలలో పెద్దఎత్తున సంతకాల సేకరణ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల నుండి ఈ సంతకాల సేకరణ నిర్వ హించి జిల్లా కలెక్టర్‌కు వీటిని అందజేయనున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి రాపూరు మండలాన్ని నెల్లూరులోనే కోనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# మలబార్‌గోల్డ్ బ్రైడ్స్‌ఆఫ్ ఇండియా ఎడిషన్‌కు విశేష స్పందన




**నెల్లూరు,డిసెంబరు11 ప్రభాతవార్త- విద్య** భారతీయ వివాహ వారసత్వాన్ని వేడుకగా చేసుకుంటూ బ్రైడ్స్ ఆఫ్ ఇం డియా 15వ ఎడిషన్ ప్రచారాన్ని నగరంలోని స్థానిక మల బార్‌గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో ఆవిష్కరించారు. అనంత రం మహిళా ఖాతాదారులు సరి కొత్త ఆభరణాలను ధరించి పోస్టర్‌ను ఆవి ష్కరించారు. షోరూం హెడ్ షాహిల్ మాట్లాడుతు తమ సంస్థదేశంలోని అన్నీ ప్రాంతాల వధువుల ప్రత్యేక సాంప్రదాయాలను గౌరవిస్తూ, అత్యున్నత నైపుణ్యాలతో సాటి లేని అభర నాలను రూపొం దిస్తూ అపూర్వమైన వారసత్వాన్ని కొనసాగిచటం జరుగుతుందన్నారు. తమ అమ్మ కాల్లో ప్రధానంగా, ప్రతిష్టాత్మకంగా నిలిచే బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 15వ ఎడిషన్ ప్రచారం కోసం అంద రూ ఎంతో ఆశక్తిగా ఎదురుచూడటం తమ కలెక్సన్స్‌కి ఉన్న డిమాండ్‌ను వక్యం చేయటం జరుగుతుం ద న్నా రు. ఈ ఏడాది ఈ ఎడిషన్‌లో 22మంది వధువులు, 10మంది ప్రముఖులైన ఎన్టీఆర్, కార్తీ, ఆలియా భట్, కరీనా కపూర్, అనిల్‌కపూర్, శ్రీనిధి శెట్టి,రుక్మిణి, మిశ్రా,ప్రార్థనా బెహేరా, మనసిపారేఖ్‌లు పాల్గొని విభి నం, వైవిధ్యంగా పొందు పరచటం జరిగిందన్నారు. పర్యావరణ, సామాజికపాలన, సూత్రాల పట్ల మలబార్ గ్రూఫ్ స్థాపించిన నాటి నుండి బలమైననిబద్దతతో పనిచేస్తూ ప్రజలఆరోగ్యం, గృహనిర్మాణం, ఆకలి నిర్మూలణ,విద్య, పర్యావరణ పరిరక్షణ,వంటి వాటిలో 5శాతం లాబాలను అందిస్తూ స్పూర్తిగా నిలిచిందన్నారు. అందరూ తమ నూతన ఉత్పాదనలని ఆదరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ నూతన కార్యవర్గం



**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త** :స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షులుగాఎస్. శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులందరికి ఎల్లవేలలా అందుబాటులో ఉంటానని ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వచ్చే విధంగా అసోసియేషన్ దృష్టికి తీసుకెలుతానని తెలిపారు. ఉద్యోగుల సమస్యల కోసం పోరాటాలకైనా వెనుకాడదని తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవితోపాటు అసోసియేట్ ప్రెసిడెంట్ డాకటర్ పి.ప్రతిమ, వైస్ ప్రెసిడెట్ ఉమెన్, ఎంపిడిఓ శ్రీదేవి, వైస్ ప్రెసిడెంటుల వెంకటేశ్వరరావు, జె.వీరయ్య, కె.రామక్రిష్ణ, ఓ.సుజల్‌కుమార్, సెక్రటరీ డి.వి. నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.వేణుకుమార్,ఎస్.బసవమోహన్, ఎన్.పల్లవి, బి.రూబెన్,కె.భాస్కర్ డిఅరుణ్‌కుమార్,జి.సుదా, అన్ని ప్రభుత్వశాఖల నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, గెజిటెఅధికారులు హాజరయ్యారు.

# ఓవెల్ మినర్వా పాఠశాలలో సోషల్ సర్వీస్‌డే కార్యక్రమం



**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త :** కావలి రా జావీధిలోని ఓవెల్ మినర్వా పాఠశాల విద్యా ర్థులకు సామాజిక బాధ్యత అలవర్చే విధంగా ప్రతి గురువారం సోషల్ సర్వీస్‌డేగా నిర్ణయిం చి విద్యార్థులచేత కావలి పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో ఉన్న అనాథ లకు,వృద్ధులకు, యాచకులకుపండ్లు, ఆహారం, దుస్తులు వంటివి పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో భాగంగా హెల్ప్‌టు హెల్ప్‌లెస్ సొసైటి స్వచ్ఛంద సంస్థకు విద్యార్థులు సేకరించిన విరాళాలతో దుప్పట్లు, నిత్యవసర సరుకులు వితరణ చేయడం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఇతరులకు సాయం చేయడం, సామాజిక బాధ్యతగా బావించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఓవెల్ విద్యాసంస్థల సిఎండి వేణు, సిఈఓ ప్రమీల, జిఎం మహదేవ, ఈడి బాలు, వైస్ ప్రిన్సిపాల్ షరీఫ్, ఏజీఎం అశోక్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డాక్టర్ రామస్వామిని సత్కరించిన సత్యం బృందం



**కావలి,డిసెంబర్ 11 ప్రభాతవార్త** : కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) అధ్యక్షులుగా డాక్టర్ రామస్వామి మల్టీస్పెషాలిటిఆసుపత్రి అధినేత డాక్టర్ మంచి కంటి రామస్వామిని పట్టణంలోని ప్రముఖ సత్యం సూపర్ బ్యాండ్‌మేళం అధినేత తాళ్ళపాలెం సత్యనారాయణ బృందంతో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.సత్యనారాయణ మాట్లాడతూ ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టమే కాకుండా కరోనా వంటి కష్టకాలంలో డాక్టర్ రామస్వామి తన ప్రా ణాలను సైతం లెక్కచేయకుండా ఎంతో మంది ప్రాణాలను కాపాడడం జరగిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం సూపర్ బ్యాండ్‌మేళం బృందం పాల్గొన్నారు.